Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

Postal regd: GTR/115/2025-27

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక

అమరావతి సంపుటి (Vol) : 10 సంచిక (Issue) : 27 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 (Andhra Pradesh Capital's First Telugu Weekly)

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

గురువారం, 16 - 10 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI : APTEL/2015/66622 Postal regd: GTR/115/2025-27 స్థాపితం : 2015

## రైతుల శ్రేయస్సు కోసం లెక్కలేనన్ని సంస్కరణలు తెచ్చాం.. ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** రైతులకు కేంద్రంలోని గత కాంగ్రెస్ ప్రభుత్వం చేసేందేమీ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 2004 నుంచి 2014 వరకూ యూపీఏ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అయితే బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 11 ఏళ్లుగా రైతుల అభివృద్ధి, స్వయం సమృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుందని వివరించారు. న్యూఢిల్లీలోని అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శనివారం నాడు జరిగిన ప్రత్యేక కృషి ప్రోగ్రాంలో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా గత నెలలో అమల్లోకి వచ్చిన జీఎస్టీ సంస్కరణతో రైతులు, దేశంలోని గ్రామీణ రంగానికి మరింత ప్రయోజనం చేకూరిందని మోదీ చెప్పారు. రైతుల ఆదాయం పెంచేందుకు, పంటల సాగు వ్యయం తగ్గించేందుకు గత పదేళ్లుగా ఎన్డీయే ప్రభుత్వం ఎరువులపై రూ.13 లక్షల కోట్ల సబ్సిడీ ఇచ్చిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. యూపీఏ పదేళ్లలో రూ.5 లక్షల కోట్లు మాత్రమే సబ్సిడీగా ఇచ్చిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు వ్యవసాయ రంగానికి ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని వివరించారు. గత ప్రభుత్వాలకు వ్యవసాయంపై ఎలాంటి విజన్ లేదని విమర్శించారు. వ్యవసాయరంగానికి సంబంధించిన వివిధ శాఖలు ఇష్టారీతిలో వ్యవహరించడం వల్ల దేశంలోని వ్యవస్థాయ వ్యవస్థ బలహీనమవుతూ వచ్చిందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిలో మార్పులు చేస్తూ విత్తనాల దగ్గర నుంచి మార్కెట్ వరకూ రైతులకు ప్రయోజనాలు చేకూరే లెక్కలేనని సంస్కరణలు తెచ్చామని చెప్పారు.

**వ్యవసాయ ఎగుమతులు రెట్టింపు**

దేశ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు దాదాపు రెట్టింపయ్యాయని, ఆహారధాన్యాలు, పళ్లు, కాయగూరల ఉత్పత్తి సుమారు 90 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెరిగిందని, గతంలో ఇది 64 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉండేదని చెప్పారు. 2014 నుంచి తేనె ఉత్పత్తి రెట్టింపు అయిందని అన్నారు. అభివృద్ధి భారతాన్ని కోరుకుంటే ప్రతి రంగంలోనూ ఇండియా బలపడాల్సి ఉంటుందన్నారు. ఏవో కొన్ని సాధించినంత మాత్రాన తృప్తి పడిపోరాదని సూచించారు. వెనుకబడిన ప్రాంతాలపై దృష్టి పెట్టినప్పుడే గణనీయమైన ఫలితాలు ఉంటాయన్నారు. ఇవాళ యాస్పిరేషనల్ జిల్లాల్లో ప్రసూతి మరణాలు తగ్గాయని, చైల్డ్ హెల్త్ మెరుగైందని, విద్యాప్రమాణాలు పెరిగాయని చెప్పారు. దీంతో ఈ జిల్లాలు ఇతర జిల్లాల కంటే మెరుగైన రీతిలో దూసుకెళుతున్నాయని, ఈ మోడల్ ఆధారంగా వ్యవసాయంలో వెనుకబడిన 100 జిల్లాలను అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించామని, ఇందువల్ల అవి మరింత మెరుగైన జిల్లాలుగా మారనున్నాయని చెప్పారు.

## కాలుష్య నియంత్రణ చర్యలు వేగవంతం చేయాలి : పవన్ కల్యాణ్ ఆదేశాలు



**అమరావతి, (రాజధాని వార్తలు):** కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇవాళ (శనివారం) సమీక్ష సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమీక్షలో కాకినాడ జిల్లా యంత్రాంగం పాల్గొంది. ఉప్పాడ తీర ప్రాంతంలో కాలుష్య నియంత్రణ అంశాలపై దిశానిర్దేశం చేశారు పవన్ కల్యాణ్. కాకినాడ జిల్లాలో ఉన్న పారిశ్రామిక కాలుష్యం, మైనింగ్ మూలంగా తలెత్తుతున్న కాలుష్య ఇబ్బందులపై చర్చించారు. కాకినాడలో చేపట్టిన మత్స్యకారులతో మాట.. మంతిలో మత్స్యకారులు ప్రస్తావించిన అంశాలు, వారి సందేహాలపై పీసీబీ నుంచి వివరాలు తీసుకున్నారు పవన్ కల్యాణ్. పొల్యూషన్ ఆడిట్‌కి అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించారు. కాకినాడ జిల్లాతోపాటు గోదావరి జిల్లాల్లో ఉన్న కాలుష్య పరిస్థితులు, పర్యావరణ పరిరక్షణపై వివరాలు అడిగి పవన్ కల్యాణ్ తెలుసుకున్నారు.

## అర్ధరాత్రి గజరాజుల బీభత్సం



**తిరుపతి, (రాజధాని వార్తలు):** జిల్లాలోని చంద్రగిరి మండలం యల్లంపల్లిలో గజరాజులు బీభత్సం సృష్టించాయి. అర్ధరాత్రి గ్రామంలోకి వచ్చిన ఏనుగుల గుంపు.. పంట పొలాలపై దాడి చేసి పూర్తిగా ధ్వంసం చేశాయి. 7 పెద్ద ఏనుగులు, 2 చిన్న ఏనుగుల గుంపు గ్రామ పరిసరాల్లోకి చొరబడింది. అర్ధరాత్రి ఏనుగుల భీకర శబ్దాలతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రైతులు పండించిన వరి పంట, గడ్డివాము, ఫెన్సింగ్ కూసాలు, నీటి పైపులను ఏనుగులు పూర్తిగా ధ్వంసం చేసాయి. పుంగనూరు నియోజకవర్గం, పులిచర్ల మండలం నుంచి యల్లంపల్లికి గజరాజులు చేరినట్లు రైతులు అనుమానిస్తున్నారు. వెంటనే ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు గ్రామస్తులు తెలియజేశారు. హుటాహుటిన గ్రామానికి చేరుకున్న ఫారెస్ట్ అధికారులు.. ఏనుగులను అడవివైపు తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. గ్రామస్తులు కూడా అటవీ శాఖ అధికారులకు సహాయంగా నిలిచారు. ఏనుగుల గుంపు బీభత్సంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. పంటలను మొత్తం ఏనుగులు నాశనం చేయడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడెప్పుడు ఏనుగులు గ్రామాన్ని వీడి అడవిలోకి వెళ్లిపోతాయా అని ప్రజలంతా ఎదురు చూస్తున్న పరిస్థితి. వాటిని అడవిలోకి తరలించేందుకు అటవీ అధికారులు విశ్వప్రయత్నం చేస్తున్నారు.

## అలా ఉంటే జగన్ తట్టుకోలేడు...పల్లా షాకింగ్ కామెంట్స్



**అమరావతి, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం మూడు ప్రాంతాలనూ సమానంగా అభివృద్ధి చేస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... విశాఖపట్నం దేశంలో అతిపెద్ద డేటా వ్యాలీగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖ వరల్డ్ డేటా సెంటర్‌గా మారబోతుందని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులు వైసీపీ నాయకుల వల్ల భయపడిపోతున్నారని మండిపడ్డారు. 2047 లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని వెల్లడించారు. మెడికల్ కాలేజీలు, స్టీల్ ప్లాంట్ ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేట్‌పరం కావని స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీలు పూర్తి కావాలంటే రూ.7,300 కోట్లు కావాలన్నారు. కాలేజీ లను పూర్తి చేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వైసీపీపై ఫైర్ అయ్యారు పల్లా. పీపీపీ విధానం వల్ల ఎవరికీ నష్టం జరగదన్నారు. లిక్కర్ వ్యవహారంలో తాము ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని చెప్పారు. గత పాలకులు చేసిన పాపాలే ఇప్పుడు శాపాలయ్యాయని విమర్శించారు. అక్రమ లిక్కర్ వ్యవహారంలో ఎంతటి వారున్నా కచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అంటే తమకు ఎనలేని గౌరవం ఉందని.. బొత్సకు జగన్ వల్లే ప్రాణహాని ఉందన్నారు. కూటమి నాయకుల నుంచి కానీ.. ప్రభుత్వం వల్ల కానీ బొత్సకి ఎటువంటి హాని లేదని తెలిపారు. ఇటీవల కాలంలో శాసనమండలిలో బొత్స సత్యనారాయణ బాగా ఫోకస్ అవుతున్నారని చెప్పారు. బాబాయ్‌ను ఎవరు చంపారో అందరికీ తెలుసని అన్నారు. తనని దాటి వెళ్లిపోతున్నారంటే జగన్ తట్టుకోలేరంటూ పల్లా శ్రీనివాస్ వ్యాఖ్యలు చేశారు.

## ప్రధాని మోదీ ఏపీ పర్యటన షెడ్యూల్ ఖరారు.. వివరాలివే..



**కర్నూలు, (రాజధాని వార్తలు):** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఈనెల 16వ తేదీన కర్నూలు జిల్లా పర్యటనకు ప్రధాని మోదీ రానున్నారు. ఉదయం 7:50 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరనున్నారు ప్రధాని మోదీ. 16వ తేదీన ఉదయం 10:20 గంటలకు కర్నూలు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని.. అనంతరం హెలికాప్టర్‌లో సున్నిపెంటకు బయలుదేరుతారు. అక్కడ నుంచి ఉదయం 11:10 గంటలకు రోడ్డు మార్గంలో శ్రీశైలం భ్రమరాంబ గెస్ట్ హౌస్‌కి చేరుకోనున్నారు ప్రధాని. 16వ తేదీన ఉదయం 11:45 గంటలకు భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకోనున్నారు. మధ్యాహ్నం 1:40 గంటలకు సున్నిపెంటలో హెలిప్యాడ్ నుంచి నన్నూరు హెలిప్యాడ్‌కు బయలుదేరనున్నారు. మధ్యాహ్నం 2:30 గంటలకు రాగమయూరి గ్రీన్ హిల్స్ వెంచర్‌కు చేరుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం రాగమయూరి గ్రీన్ హిల్స్‌లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. అనంతరం కర్నూలు ఎయిర్ పోర్ట్ నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు. ఈ మేరకు ప్రధాని కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

## రాహుల్‌కు నోబెల్ శాంతి బహుమతి..!: కాంగ్రెస్ నేత



**న్యూఢిల్లీ:** వెనిజులాలూ శాంతి ప్రక్రియ నెలకొల్పే క్రమంలో ప్రజాస్వామ్య హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన ప్రతిపక్ష నేత, కార్యకర్త మరియా కొరినా మచాడో నోబెల్ బహుమతికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఆమెపై ప్రశంసల వర్షం కురుస్తోంది. అయితే ఆమెకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీకి సారూప్యత ఉందని కాంగ్రెస్ పార్టీ నేత సురేంద్ర సింగ్ రాజ్‌పుట్ అభిప్రాయ పడ్డారు. వెనెజువెలాలో ఆమె ప్రజాస్వామ్య హక్కుల కోసం పారాటం చేస్తే.. భారత్‌లో రాజ్యాంగాన్ని రక్షించేందుకు రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని స్పష్టం చేశారు. ఆయన సైతం ఈ శాంతి బహుమతికి అర్హుడని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలి లోక్‌సభ స్థానం నుంచి ఆయన గెలుపొందారన్నారు. ఈ మేరకు శనివారం కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సురేంద్ర సింగ్ రాజ్‌పుట్ తన ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

**రాజ్యాంగంపై దాడంటూ..**

ప్రధాని నరేంద్ర మోదీతోపాటు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని అంతం చేసేందుకు కుట్రలు చేస్తోం దని రాహుల్ గాంధీ విమర్శిస్తున్నారు. వివిధ సందర్భాల్లో పలు వేదికపై నుంచి ఆయన ఈ తరహా విమర్శలు సంధిస్తున్నారు. అలాగే ప్రజల ప్రజాస్వామ్య హక్కులతోపాటు భారత రాజ్యాంగాన్ని సైతం రక్షించేందుకు తాను యుద్ధం చేస్తున్నట్లు ఇప్పటికే పలుమార్లు రాహుల్ గాంధీ ప్రకటించిన విషయం విదితమే.

**రాహుల్ వ్యాఖ్యలు.. తోసిపుచ్చిన బీజేపీ**

అయితే రాహుల్ గాంధీ చేసిన ఈ ఆరోపణలను బీజేపీ ఇప్పటికే తోసిపుచ్చింది. కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడైన రాహుల్ గాంధీ భారత వ్యతిరేక శక్తుల జెండా మోసే వ్యక్తిగా అభివర్ణించింది. ఆయన స్వభావమే అంత అని బీజేపీ ఇప్పటికే వివరించింది.

## యువ వ్యాపారి గుప్తా హత్య కేసులో పూజా శకున్ పాండే అరెస్టు

**అలీగఢ్:** ఉత్తరప్రదేశ్ యువ వ్యాపారి అభిషేక్ గుప్తా హత్య కేసులో ప్రధాన నిందితురాలైన అఖిల భారత్ హిందూ మహాసభ ఆఫీస్ బేరర్ పూజా శకున్ పాండేను పోలీసులు భరత్‌పూర్‌లో శనివారం నాడు అరెస్టు చేశారు. అభిషేక్ గుప్తా (25) సెప్టెంబర్ 26న హత్రాస్‌కు వెళ్లేందుకు అలీగఢ్‌లోని రోరావర్ ప్రాంతంలో తన తండ్రితో కలిసి బస్సు ఎక్కుతుండగా ఇద్దరు దుండగులు తుపాకీతో కాల్చి పారిపోయారు. గుప్తా అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటన తీవ్ర సంచలనమైంది. అభిషేక్ గుప్తాను కాల్చిచంపిన మహమ్మద్ ఫజల్‌ను పోలీసు అరెస్టు చేయగా, ఈ హత్యకు పూజ, ఆమె భర్త రూ.3 లక్షల సుపారీ ఇచ్చారని నిందితుడు పోలీసుల ముందు ఒప్పుకున్నాడు. పూజ, ఆమె భర్త అభిషేక్ ఫోటో చూపించారని, రూ.1 లక్ష ముందుగా చెల్లించారని వెల్లడించాడు. హత్య జరిగిన రోజు రాత్రే పూజ, ఎబీహెచ్‌ఎం ప్రతినిధిగా ఉన్న ఆమె భర్త అశోక్ పాండేపై పోలీసులు కేసు నమోదు చేశారు. అశోక్ పాండే, ఇద్దరు షూటర్లను పోలీసులు అరెస్టు అరెస్టు చేసినప్పటికీ పూజా శకున్ పాండే పరారీలో ఉన్నారు. ఈ నేపథ్యంలో పూజా శకున్ పాండేను సైతం పోలీసులు శనివారం నాడు అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు. పూజా శకున్ పాండే, ఆమె భర్త అశోక్ పాండేలకు షూటర్లు ఇద్దరూ ఏడెనిమిదేళ్లుగా బాగా తెలుసునని, నెల రోజుల క్రితం వాళ్ల ఇంట్లో వెల్డింగ్ వర్క్ కూడా చేశారని పోలీసుల ఇంటరాగేషన్‌లో వెల్లడైంది. అభిషేక్ గుప్తాను చంపేందుకు ఆ ఇద్దరు షూటర్లకు 3 లక్షలు సుపారీ ఇచ్చినట్టు కూడా విచారణలో తేలినట్టు పోలీసులు తెలిపారు. ఆగస్టు–సెప్టెంబర్ మధ్య ఫజల్‌ను అశోక్ పాండే 27 సార్లు, పూజా శకున్ పాండే 11 సార్లు కాంటాక్ట్ చేసినట్టు కాల్ రికార్డుల్లో వెల్లడైంది. పూజా శకున్ పాండే గతంలో మహాత్మాగాంధీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సేని బహిరంగంగా ప్రశంసించడంతో ఒక్కసారిగా ప్రచారంలోకి వచ్చింది.

## మైలవరం కళాశాలలో మేరా యువభారత్ మై భారత్ ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్




**మైలవరం, (రాజధాని వార్తలు):** కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ మేర యువ భారత్ మై భారత్ ఆధ్వర్యంలో స్థానిక మైలవరం లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల నందు బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ అనే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రధానమంత్రి ఆదేశాల మేరకు ఫిట్ ఇండియా మరియు ఫిజికల్ యాక్టివిటీస్‌ని ముందు తీసుకెళ్లడంలో మై భారత్ మేరా యువభారత్ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. మైలవరం లక్కిరెడ్డి బాలి రెడ్డి కళాశాల నందు బాయ్స్ క్యాటగిరీ వాలీబాల్ షాట్ పుట్ మరియు రన్నింగ్ ఉమెన్స్ క్యాటగిరి కబాడీ రన్నింగ్ షార్ట్ పుట్ వంటి గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కళాశాల వయసు ప్రిన్సిపల్ డాక్టర్ బి రమేష్ రెడ్డి మరియు స్థానిక మైలవరం స్టేషన్ ఎస్ఐ కృష్ణా రెడ్డి ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి శివహరి ప్రసాద్ అసిస్టెంట్ ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్ ఉమామహేశ్వర్ రెడ్డి ఫిజికల్ డైరెక్టర్ ఎన్ వి రాజ్ కుమార్ మరియు బేబీ రాణి మరియు మైభారత్ టీం తదితరులు పాల్గొని నిర్వహించి గేమ్స్‌లో కబాడీ మరియు వాలీబాల్ నందు పాల్గొన్న పురుషులకు భాగం మరియు మహిళా విభాగం విన్నర్స్‌కి మరియు రన్నర్స్‌కి సర్టిఫికెట్స్‌తో పాటు మెడల్స్ కప్పులను అందించడం జరిగింది. అదేవిధంగా అథ్లెటిక్స్ రన్నింగ్ అండ్ షాట్ పుట్‌నందు పాల్గొన్న పురుషులు మరియు మహిళలకు మొదటి దద మరియు రెండో బహుమతి మరియు మూడో బహుమతి కింద మెడల్స్ మరియు కప్స్‌ను అందజేయడం జరిగింది.

# గోమతి నారాయణలో మెడికల్ క్యాంప్ - నారాయణ హెచ్ ఆర్ విభాగం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నగరంలోని స్థానిక గోమతి నగర్ నందు గల గోమతి నారాయణ సీబీఎస్ఈ స్కూల్లో సోమవారం విద్యార్థులకు, సిబ్బందికి వైద్య శిబిరం నిర్వహించారు. నారాయణ విద్యాసంస్థల హెచ్ఆర్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో నారాయణ మెడికల్ కళాశాలకు చెందిన జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఏ నిరంజన్ రెడ్డి, చిన్నపిల్లల దంత వైద్య నిపుణులు డాక్టర్ వంశీ భరత్, డాక్టర్ అనీస్ హజీరా, కంటి వైద్య నిపుణులు డాక్టర్ శివప్రియ, దంత వైద్య నిపుణులు డాక్టర్ ఏ వి కార్తీక్ తదితరులు పాల్గొని విద్యార్థులకు సిబ్బందికి వివిధ రకాల వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఆర్ మస్తానయ్య మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన అవసరమన్నారు. నారాయణ విద్యాసంస్థల హెచ్ఆర్ విభాగం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది వైద్య శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు, సంస్థలో పనిచేసే ఉపాధ్యాయులు, సిబ్బందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అవసరమైన వారికి నారాయణ మెడికల్ కళాశాల మరియు వైద్యశాలలో చికిత్సలు అందజేస్తున్నామన్నారు.

నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఏజీఎం రవి వర్మ మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించడమే కాకుండా వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు ఇస్తున్నామన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను వారి తల్లిదండ్రులకు తెలియజేసి అవసర మైన చికిత్సలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ సుధీర్ మాట్లా డుతూ నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి ఏజీఎం రవి వర్మ సూచనల మేరకు విద్యార్థు లకు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ విభాగాలకు చెందిన నిష్ణాతులైన వైద్య నిపుణులు ఈ వైద్య శిబిరంలో పాల్గొని విద్యార్థులకు, అధ్యాపకులకు సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంపొందిస్తున్నార న్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఆదిశేషయ్య, హెచ్ఆర్ సుభాష్, పిఆర్ఓ నరేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# "సూపర్ జిఎస్టీ సూపర్ సేవింగ్స్" పై ప్రత్యేక అవగాహనా కార్యక్రమం







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వి.ఎస్.యూ) మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో "GST 2.0 Reforms - Super GST Super Savings" అనే అంశంపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమం విశ్వవిద్యాలయ సివి రామన్ సెమినార్ హాల్లో ఘనంగా నిర్వహించబడింది. కార్యక్రమానికి విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు ప్రధాన అతిథిగా హాజరై, విద్యార్థులు పన్ను విధానాల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ, "జిఎస్టీ 2.0 సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థను సమగ్రమైన పారదర్శకత వైపు నడిపించను న్నాయి. ఈ సంస్కరణల ద్వారా వ్యాపార వాతావరణం సులభతరం అవుతుంది. విద్యార్థులు ఇలాంటి ప్రాక్టికల్ చర్చల్లో పాల్గొనడం వల్ల పరిశోధనా దృష్టి మరియు ఫైనాన్స్ అవగాహన పెరుగుతాయి" అన్నారు. విశిష్ట అతిథిగా శ్రీ కిరణ్ గారు, వాణిజ్య పన్నుల సంయుక్త కమిషనర్ మాట్లాడుతూ, "GST 2.0 Reforms వాణిజ్య రంగంలో కొత్త అవకాశాలను తెరుస్తాయి. పన్ను చెల్లింపులు, రిఫండ్‌లు, మరియు అకౌంటింగ్ వ్యవస్థలో పూర్తిస్థాయి డిజిటలైజేషన్ ద్వారా సులభతరం, పారదర్శకత, మరియు వేగవంతమైన సేవలు అందించడం లక్ష్యం," అని వివరించారు. అలాగే "Super GST Super Savings" సూత్రం ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంపొందించడంతో పాటు వ్యాపారులకు కూడా ప్రోత్సాహం కల్పించడమే ముఖ్య ఉద్దేశమని చెప్పారు.

గౌరవనీయ అతిథి డాక్టర్ కె.సునీత, రిజిస్ట్రార్, వి.ఎస్. యూ కళాశాల, నెల్లూరు మాట్లాడుతూ, "వాణిజ్య పన్నుల శాఖ మరియు విశ్వవిద్యాలయం సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆర్థిక మరియు వ్యాపార పన్నులపై అవగాహన పెంపొందించడానికి దోహదపడుతుంది," అని అన్నారు. ఆచార్య సిహెచ్ విజయ, ప్రిన్సిపల్, వి.ఎస్.యూ కళాశాల, నెల్లూరు మరియు ఆచార్య సిహెచ్ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్, వి.ఎస్.యూ కళాశాల కావలి, డాక్టర్ సాయి శ్రవంతి, వాణిజ్య పన్నుల శాఖ అధికారుల బృందం సిహెచ్ గోపీచంద్ Asst Commissioner No2 Nellore, ఎస్ కె. గౌసేపీరా Asst Commissioner No3 Nellore, జి వి సునీల్ ఎ ఈ ఓ, నిష్కుమార్ జి ఎస్ టి ఓ, అనిల్ కుమార్ జి ఎస్ టి ఓ, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారుల బృందం "GST Portal and New Filing System" పై ప్రదర్శన ఇచ్చి, కొత్త పన్ను రిటర్న్ ప్రక్రియలను వివరిస్తూ ప్రాక్టికల్ డెమోన్స్ట్రేషన్ కూడా నిర్వహించారు.

# అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్య ప్రదర్శిస్తే చర్యలు తప్పవు

**- నిర్దిష్ట గడువులోగా సమస్యలను పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కలెక్టరేట్‌నందు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను హెచ్చరించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్, డిపివో శ్రీధర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ వేణుగోపాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని, పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కు స్వాగతం పలికిన ఎంపీ వేమిరెడ్డి




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** భారత ప్రధాని నరేంద్ర మోడీని, అలాగే కేంద్ర మంత్రులను కలిసేందుకు ఢిల్లీకి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు చంద్రబాబు నాయుడుకి, ఐటీ శాఖ మంత్రి వర్యులు నారా లోకేష్‌కి నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సాదర స్వాగతం పలికారు. సోమవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్‌లో సీఎంని, లోకేష్‌ని కలిసి వారికి ఆహ్వానం పలికారు. రాష్ట్రంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలతో పాటు గూగుల్ అనుబంధ సంస్థ రైడన్ ద్వారా విశాఖలో రూ. 84 వేల కోట్లతో ఏర్పాటు కానున్న డేటా సెంటర్ పై ప్రధాని నరేంద్ర మోడీతో సీఎం చంద్రబాబు చర్చించనున్నారు.

# చికిత్స పొందుతున్న మున్వర్‌ని పరామర్శించిన పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు అపోలో హాస్పిటల్లో గాయపడి చికిత్స పొందుతున్న వైఎస్ఆర్సిపి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మున్వర్ మరియు వారి అల్లుడును వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మెరుగైన వైద్యం అందించాలని హాస్పిటల్ సిబ్బందిని చంద్రశేఖర్ రెడ్డి కోరారు. అనంతరం మున్వర్ కుటుంబ సభ్యులతో చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.



# మహిళల రక్షణ కొరకు శక్తి యాప్





**విజయనగరం, (రాజధాని వార్తలు):** నేడు జిల్లా కోర్టు పరిధిలో ఉన్న అన్ని కోర్టులలో ఉన్న మహిళా సిబ్బందికి వారి యొక్క రక్షణ కొరకు భద్రత కొరకు న్యాయ అవగాహన సదస్సును ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు ఎం.భబిత ముఖ్యఅతిథిగా హాజరు అయినారు. ఈ కార్యక్రమంలో వారు అన్ని కోర్టులలో పనిచేస్తున్న మహిళా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శక్తి ఆప్ ను వారి యొక్క మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ తప్పనిసరిగా చేసుకోవాలని, ఈ యాప్ ద్వారా మహిళలు ఎక్కడ ఏ పరిస్థితుల్లో ఉన్నప్పటికీ అత్యవసర రక్షణ లేదా సహాయము కావలసిన ఎడల ఈ యాప్ వినియోగించి వారికి పోలీస్ శాఖ ద్వారా రక్షణ త్వరితగతిన అందుతుందని తెలియజేశారు. ప్రతి ఒక్క మహిళ శక్తి యాప్ ను వారి యొక్క మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకుని వినియోగించాలని తెలియజేశారు. విజయనగరం మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కే.నరసింహమూర్తి, మహిళా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ శిరీష కోర్టు సిబ్బందికి శక్తి యాప్‌ను ఏ విధంగా డౌన్లోడ్ చేసుకోవాలో మరియు దాన్ని ఏ విధంగా ఉపయోగించాలో తర్ఫీదునిచ్చారు. మహిళల రక్షణ కొరకు శక్తి యాప్‌ను ఈ క్రింది విధంగా డౌన్లోడ్ చేసుకోవాలి ముందుగా మొబైల్ ఫోన్లో ఉన్న ప్లే స్టోర్‌లోకి వెళ్లి శక్తి యాప్ అని టైప్ చేస్తే యాప్ డౌన్లోడ్ అవుతుంది. తర్వాత మీ ఫోన్ నెంబర్ ఎంటర్ చేస్తే ఓటిపి వస్తుంది అది ఎంటర్ చేసిన తరువాత వ్యక్తిగత వివరాలు నమోదు చేసుకోవాలి. అదేవిధంగా బాల బాలికలు మిస్సింగ్ అయినా ఈ యాప్ ద్వారా రక్షణ పొందవచ్చు. మిస్సయిన బాలబాలికను గుర్తించడానికి యాప్ ఉపయోగపడుతుందని తెలియజేశారు.

# నెల్లూరులో మొట్టమొదటిసారిగా విదేశీ జలకన్యలతో విన్యాసాలు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని ఎస్ వి జి కాలేజ్ గ్రౌండ్ లో నెల్లూరు నగర చరిత్రలో మొట్టమొదటిసారిగా సాగర కన్య ఎక్కడో విదేశాల్లో పేరుగాంచిన మెర్మడ్ షో ఎటువంటి ఆక్సిజన్ మాస్క్ లేకుండా పది అడుగుల వాటర్ టన్నెల్లో విదేశీ కన్యలతో విన్యాసాలు జలకన్యలచే అద్భుత కల్పనని నిజంగా ఉన్నాయా అని మైమరిపించే విధంగా మన నెల్లూరు ప్రజలు ఆనందంగా వీక్షించే విధంగా ఏర్పాటు చేశామని ఎగ్జిబిషన్ నిర్వాహకులు తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా, కెనడా దేశాల సరిహద్దులలో ఉన్న ప్రపంచ ప్రఖ్యాత గాంచిన నయాగరా జలపాతం అని 19 అడుగుల వెడల్పు 25 అడుగుల ఎత్తుతో ఏర్పాటు చేశామని అలాగే 230 అడుగుల భారీ ముఖ ద్వారాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు ఈ ఎగ్జిబిషన్లో 50కి పైగా క్లాత్, బ్యాంగిల్స్, గృహోపకరణ వస్తువులు వంటి అనేక రకాల స్టాల్స్ని జెయింట్ వీల్, కొలంబస్ వంటి అనేక రకాల ఎమ్యూజ్మెంట్ ఏమ్యూజ్ మెంట్ రైట్స్ని ఏర్పాటు చేశామని 50 రోజులు పైగా నడిచే ఈ ఎగ్జిబిషన్ని నెల్లూరు ఎస్వీజిఎస్ కాలేజీ గ్రౌండ్స్ ఎన్టీఆర్ నగర్ హైవే దగ్గర ఏర్పాటు చేసి మా పినాకిని ఎగ్జిబిషన్ను 10/10/ 2025 శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభం అవుతుందని తెలియజేశారు ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి 10:00 వరకు మరియు సెలవు రోజుల్లో మధ్యాహ్నం 12 గంటల నుండి రాత్రి పది గంటల వరకు జరుగుతుంది కావున సకుటుంబ సమేతంగా




విచ్చేసి పిల్లలు పెద్దలు అద్భుతమైన మధుర ఆనందాన్ని పొందాలని కోరుతున్నట్లు కావున సకుటుంబ సమేతంగా విచ్చేసి పిల్లలు పెద్దలు అద్భుతమైన మధుర ఆనందాన్ని పొందాలని నిర్వాహకులు మీడియా సమావేశంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎం రాజారెడ్డి, ఎస్ కే బాబు, గడ్డం అచ్చయ్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# ఉదయగిరి వుడ్ కట్లరీ కళానైపుణ్యాన్ని ప్రోత్సహించండి

## - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకు సూచించిన సీఎం




**నెల్లూరు, వెంకటాచలం, (రాజధాని వార్తలు):** "చాలా బాగుంది... ఉదయగిరి వుడ్ కట్లరీని ప్రోత్సహించండి..జిల్లాకు మంచి గుర్తింపు వస్తుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకు సూచించారు. శుక్రవారం వెంకటాచలం మండలం ఈదగాలి గ్రామంలో నందగోకులం లైఫ్స్కూల్, నంది పవర్బుల్ ప్రాజెక్టు, విశ్వసముద్ర బయో ఎనర్జీ ఈథనాల్ ప్రాజెక్టులను ప్రారంభించిన సందర్భంగా, హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి స్వాగతం పలుకుతూ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఉదయగిరి ఉడ్ కట్లరీని బహుకరించగా సీఎం చాలా బాగుందని కితాబిచ్చారు. సంప్రదాయ చెక్క పనిని ఆధునిక రూపంలో తీర్చిదిద్దుతూ తయారు చేసే ఈ చెక్క కట్లరీలు స్పూన్లు, ఫోర్కులు, కత్తులు, బౌల్స్, వంట సామాన్లు, డెకరేటివ్ వస్తువులు అందం, నాణ్యతలో ప్రత్యేకమైనవిగా దేశవ్యాప్తంగా మంచి గుర్తింపుపొందాయి. సుమారు 150 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ కళ ఇప్పుడు ఉదయగిరి ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపునిచ్చింది. ప్రతి వస్తువు జాగ్రత్తగా చేతిపనితో, నాణ్యమైన పరికరాలతో రూపొందించబడుతుంది.

తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయ కళను నేటి తరం కళాకారులు ఆధునిక డిమాండ్కి అనుగుణంగా పునరుద్ధరిస్తూ, వారికి ప్రోత్సాహం అందించాలని సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్కు సూచించారు. జిల్లాలో హస్తకళలను, కళాకారులను ప్రోత్సహించడం వలన కళాకారుల జీవన ప్రమాణాలు మెరుగుపడి వారి ఆర్థిక పరిస్థితి మారుతుందని, జిల్లాలో స్వయం ఉపాధికి అవకాశాలు మెరుగుపడి ఆర్థికంగా అభివృద్ధి సాధ్యమవుతుందని సీఎం సూచించారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ కోడిగుడ్డు దినోత్సవం







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ గుడ్డు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో 500 మందికి ఉడికించిన కోడిగుడ్లు బెజవాడ సునీల్ రెడ్డి దాతృత్వంతో పంచడమైనది గుడ్డు యొక్క ప్రాముఖ్యతను గుడ్డులో ఉండే విటమిన్లు ప్రోటీన్లు అవి శరీరానికి కలుగజేసే ఉపయోగాలను గురించి వివరించడమైనది నెక్ మాజీ జోనల్ చైర్మన్ అయినా నలుబోలు బలరామయ్య నాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరము అక్టోబర్ రెండవ శుక్రవారం నిర్వహిస్తూ క్రీడాకారులకు వాకర్స్ కు గుడ్లను పంపిణీ చేయడం జరుగుచున్నది ఈ కార్యక్రమంలో నలుబోలు బల రామయ్య నాయుడు, ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ట్రెజరర్ మాగంటి ప్రసాద్. ఏవిపి ఏకొల్లు రాఘవ రెడ్డి షేక్ నసీర్ అహ్మద్, బెల్లం చెంచయ్య నాయుడు, పత్తిపాటి రమణయ్య, టి హరిబాబు నాయుడు, బి సదా నందారెడ్డి, కాగొళ్ళు శివయ్య, కె వెంకటరమణ, వి ఆదినారాయణరెడ్డి, మన్నేపల్లి సురేష్, గణపర్తి వెంకటేశ్వర్లు నాయుడు, దాసరాజు వెంకటరాజు, కిలారి మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ప్రోత్సాహకంగా క్రికెట్ కిట్ల అందజేత

## - కోవూరు మండల యువతకు క్రీడా కిట్ల పంపిణీ - క్రీడల్లో రాణించి నియోజకవర్గానికి మంచి పేరు తేవాలి - ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** యువతను క్రీడల్లో ప్రోత్సహించే ఉద్దేశంతో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా కిట్లను అందజేస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యేవేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విపిఆర్ వికాస్ కార్యక్రమంలో భాగంగా కోవూరు మండలం పడుగుపాడు బిట్ – 1, బిట్ – 2 లకు సంబంధించిన యువకులకు 15 క్రికెట్ కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి క్రీడాకారులను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుంటారని, ఆయన ప్రోత్సాహంతో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విపిఆర్ వికాస్ పేరుతో యువతకు కిట్లు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. యువత క్రీడల్లో రాణిస్తే తాము ఎంతో సంతోషిస్తామని వెల్లడించారు. యువత క్రీడల్లో రాణిస్తూ అటు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం పొందాలన్నారు. యువతను ప్రోత్సహించేందుకు ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాలరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్, టిడిపి నాయకులు జెట్టి మదన్ రెడ్డి పడుగుపాడు గ్రామ టిడిపి అధ్యక్షులు రమేష్ మరియు కరేటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

# దివ్యాంగ విద్యార్థులకు విపిఆర్ దంపతుల చేయూత

## - ఉత్తమ ప్రతిభ చూపిన భవిత విద్యార్థులకు ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం - షైనింగ్ స్టార్ అవార్డులు -2025 కార్యక్రమంలో విద్యార్థుల ప్రతిభను తెలుసుకున్న విపిఆర్ దంపతులు - విద్యార్థుల చదువులకు అండగా ఉంటామని నాడు హామీ - నేడు ఆర్థిక సహాయం అందించడంతో విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు - సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు మరోసారి తమ గొప్ప మనసును చాటారు. తాము మాట ఇస్తే.. తప్పకుండా అండగా నిలబడతామంటూ రుజువు చేశారు. ఉత్తమ ప్రతిభ చూపిస్తూ.. మంచి ఫలితాలు సాధించిన దివ్యాంగ విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. గురువారం విపిఆర్ నివాసంలో కళాశాల ఫీజుల నిమిత్తం విద్యా స్వరూపిణికి 1 లక్ష 30 వేలు, సిరివల్లికి 1 లక్ష 25 వేలు, భవాని పూజితకు 30 వేలు అందజేశారు. వారి తల్లిదండ్రులకు ఈ మేరకు నగదు అందజేశారు. ఈ ఏడాది జూన్ 9న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన షైనింగ్ స్టార్స్ అవార్డుల కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు, పొదలకూరు భవిత కేంద్రాల్లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యా స్వరూపిణి, భవాని పూజిత, సిరివల్లి అనే దివ్యాంగ విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డులు సాధించారు. ఈ నేపథ్యంలో వారి ప్రతిభను గుర్తించిన ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ.. ముగ్గురు చిన్నారుల ఉన్నత చదువులకు తాము అండగా ఉంటామని నాడు హామీ ఇచ్చారు. చిన్నారుల తల్లిదండ్రులతో ప్రత్యేకంగా మాట్లాడారు. నాడు ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న ముగ్గురు విద్యార్థుల ఫీజుల నిమిత్తం విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యా స్వరూపిణికి 1 లక్ష 30 వేలు, సిరివల్లికి 1 లక్ష 25 వేలు, భవాని పూజితకు 30 వేలు అందజేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు చిన్నారులను ఆశీర్వదించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. వారు ఎంత వరకు చదువుకుంటే అంతవరకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

విపిఆర్ దంపతుల చేయూతపై విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అడగకుండానే అండగా నిలిచి తమ పిల్లల చదువుల బాధ్యతను తీసుకున్నవారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిజేశారు. కార్యక్రమంలో ఏపీసీ వెంకట సుబ్బయ్య, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ ప్రసాద్రావు, ఎంఈవో మురళి, ఐఈఆర్టీలు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలికిన అబ్దుల్ అజీజ్




**సర్వేపల్లి నియోజకవర్గం, (రాజధాని వార్తలు):** వెంకటాచలం మండలం ఈదగాలి గ్రామంలో బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్, నందగోపాలం లైఫ్ స్కూల్ ను ప్రారంభించేందుకు విచ్చేసిన ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడుకు ఈదగాలి లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద టీడీపీ ఎంపీలు ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి ఘన స్వాగతం పలికిన నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్.

# సంపాదకీయం

## కూలుతున్న ప్రపంచాల నైరాశ్యం

ప్రపంచం ఇక అంతాన్ని సమీపించింది. కానీ ఆ అంతం ఒక అగ్ని వర్షం గానో, జల ప్రళయం గానో ఒక్క పెట్టున వచ్చిపడేది కాదు. ఒక నైతిక పతనంగా, భౌతిక క్షయంగా, అతిమెల్లగా దాపురిస్తుంది. %-% ఇదీ లాస్లో క్రస్నహొర్కాయ్ నవలల్లోని వాతావరణం. అతని తొలి రెండు ప్రసిద్ధ నవలల్లోనూ ప్రపంచం ఇక రేపో మాపో అంతం కాబోతుందన్న గుబులు ఉంటుంది. ఆ అంతానికి కారణం ఏమిటన్నది స్పష్టంగా వ్యక్తం కాదు. కానీ నవలల్లోని పాత్రలన్నీ ఆ సమీపిస్తున్న అంతాన్ని నిశ్శబ్దంగా ఒప్పుకున్నట్టే ప్రవర్తిస్తాయి. చుట్టూ క్రమంగా శిథిలమై కూలుతున్న ప్రపంచాల మధ్య తమని కాపాడే ఆశ కోసం ఎదురు చూస్తుంటాయి. ఆ ఆశ ఎప్పటికీ రాదు. ఒక్కోసారి ఎవరో రాబోయే మనిషి తమని కాపాడతాడన్న ఎదురుచూపు ఉంటుంది. కానీ ఆ వచ్చిన మనిషి తన కోసం ఎదురుచూస్తున్న వాళ్ళని మోసం చేసి వెళ్ళిపోతాడు. లాస్లో క్రస్నహొర్కాయ్‌కు ఇలాంటి ఇతివృత్తాలను సరఫరా చేసింది అతని స్వదేశమైన హంగరీలో ఆనాటి రాజకీయ వాతావరణమే అనుకోవచ్చు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత హంగరీ సోవియట్ రష్యా అధీనం లోని ఒక దేశంగా మారింది. స్టాలిన్ అదుపాజ్ఞల కింద హంగరీలో కూడా కమ్యూనిస్ట్ పాలన మొదలైంది. స్టాలిన్ చనిపోయాకా 1956లో హంగరీలో రష్యన్ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఒక ఉద్యమం మొదలైనప్పటికీ, రష్యా దాన్ని యుద్ధటాంకులతో హింసాత్మకంగా అణచివేసింది. ఆ తర్వాత ఇక 1989 దాకా హంగరీలో కమ్యూనిస్టు పాలనే కొనసాగింది. ఈ కాలమంతా ప్రజల సామాజిక జీవితం భయం, అణచివేతల మధ్య గడిచింది. 1960ల నుంచి క్రమంగా హంగరీపై రష్యా అదుపు తగ్గించుకుంటూ వచ్చినా, ప్రజలకు స్వేచ్ఛ మాత్రం పరిమితమే. లాస్లో క్రస్నహొర్కాయ్ బాల్యం, యవ్వనం అంతా ఈ వాతావరణం లోనే గడిచింది. 1989లో తన 35 ఏళ్ళ వయస్సులో కమ్యూనిస్టు పాలన ముగిసిన సందర్భాన్ని తలచుకుంటూ, “ఆ రాజకీయ స్వేచ్ఛ నమ్మశక్యం కాని విషయంలా అనిపించింది,” అంటాడు లాస్లో??? “అప్పటి దాకా అదో కాలం కదలని సమాజం. పరిస్థితులు ఎప్పటికైనా మారతాయన్న ఆశలేకుండా చేశారు పాలకులు. ఎప్పుడూ అదే బూడిదరంగు ఆకాశం, కళాకాంతుల్లేని చెట్లు, పార్కులు, వీధులు, భవనాలు, నగరాలు. చవక బార్లు, పేదరికం, మాటపై నిషేధం. మార్క్సిజంపై నమ్మకం కోల్పోయిన తొలి తరం మాది,” అంటాడు. లాస్లో క్రస్నహొర్కాయ్ 1954లో జ్యులా పట్టణంలో పుట్టాడు. అతని అసలు ఇంటి పేరు ‘కొరీన్’. కానీ అంతకుముందు హిట్లర్ చెలరేగిన కాలంలో తమని యూదులుగా పట్టించి వేసే ప్రమాదం ఉన్న ఆ ఇంటి పేరును లాస్లో తాతయ్య ‘క్రస్నహొర్కాయ్’గా మార్చాడు. (అది హంగరీలో ఒక పాత కోట పేరు.) తనకు యూదు మూలాలు ఉన్నాయన్న సంగతి లాస్లోకి కూడా పదకొండేళ్ల వయసు వచ్చే దాకా తెలియదు. పంతొమ్మిదేళ్ళ వయసులో నిర్బంధ మిలటరీ పని నుంచి తప్పించుకోవాలని కొంతా, దాస్తవిస్కీ లాంటి పంతొమ్మిదో శతాబ్దం రష్యన్ రచయితల ప్రభావంతో కొంతా లాస్లో క్రస్నహొర్కాయ్ ఇల్లు వదలి పేద ప్రజల మధ్యకు వెళ్ళి చిన్నా చితకా ఉద్యోగాలు చేయటం మొదలుపెట్టాడు. గనుల్లో కూలీ పని నుంచి డైరీ ఫార్మ్‌లో నైట్ వాచ్‌మన్ పని దాకా రకరకాల ఉద్యోగాలు చేస్తూ హంగరీ అంతా దేశదిమ్మరిలా తిరిగాడు. రాత్రిపూట డైరీ ఫార్మ్‌లో వందలాది ఆవులకు కాపలా కాస్తూనే తన తొలి నవల ‘సాటాన్‌టాంగో’ రాశాడు. వర్షపు బురద నిండిన వీధులూ, కూలిపోతున్న ఇళ్లూ, ఏదీ పండని సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు, పాడైపోయిన మిల్లులు, పేద జనం మసిలే ఇరుకుబార్లు... ఇదీ నవలకు నేపథ్యం. (ఈ నవలను దర్శకుడు బేలా టార్ 1994లో ఏకంగా ఏడున్నర గంటల సినిమాగా తీశాడు!) లాస్లో అంత సులువుగా చదివించే రచయిత కాదు. అతని నవలల్లోని పాత్రలు కదలని కాలంలో చిక్కుకుపోయి ఉన్నట్టు గానే, వాటిని చదివే పాఠకుడు కూడా ఆ ఎడతెగని వాక్యాల వరద మధ్య చిక్కుకుపోతాడు. వేగంగా కదులుతూ కూడా ఎటూ పోని లాస్లో వాక్యాలు చాలా పొడవుగా ఉంటాయి. పేరాల విభజన లేకుండా, ఫుల్‌స్టాపులు కూడా లేకుండా పేజీలకు పేజీలు కొనసాగుతాయి. “ఫుల్‌స్టాప్ అవసరం ఉన్నది దేవుడు ఒక్కడికే. అంతా ముగిసే అంతంలో ఒక ఫుల్‌స్టాప్ వాడతాడు తప్పకుండా,” అంటాడు. ఆయన ప్రసిద్ధ నవల ‘సాటన్‌టాంగో’లో మొదటి వాక్యమే ఆరు పేజీల పాటు ఏ ఫుల్‌స్టాప్ లేకుండా కొనసాగుతుంది! “ఒక స్నేహితుడితో పాటూ కూర్చుని రాత్రి పూటంతా మేల్కొని మన జీవితంలో ఎంతో ముఖ్యమైన విషయాన్ని అతనికి అర్థమయ్యేలా చెబుతున్నప్పుడు, మన మాటలకి ఫుల్‌స్టాపులూ కామాలూ అవసరం లేదు. మాట్లాడేందుకు ఊపిరీ, మాటల్లో లయా మాత్రమే కావాలి. నేను ఫుల్‌స్టాపులు తక్కువ వాడాలనీ, పొడవాటి వాక్యాలు మాత్రమే రాయాలనీ ఏమీ నియమం లాగ పెట్టుకోలేదు. పాఠకుడిని చేరువ చేసుకుని అతన్ని కన్విన్స్ చేయటానికి కథ చెప్తున్నప్పుడు నాకు ఆ లయా, ఆ రాగం, అలాంటి వాక్య నిర్మాణం సహజంగా వచ్చేశాయి,” అంటాడు. యవ్వనంలో తన చుట్టూ చవి చూసిన రాజకీయమైన ఉక్కపోత లాస్లో రచనల ఇతివృత్తాలను, శైలిని నిర్దేశించింది. అయితే అతను తన రచనలను నిరంకుశ రాజకీయ వ్యవస్థలపై ఎక్కుపెట్టలేదు. అలాంటి వ్యవస్థల కింద సమాజం క్రమ క్రమంగా క్షీణించే తీరుపై ఎక్కువ దృష్టిపెట్టాడు. ఇక అంత్య దశకు వచ్చేసిన ప్రపంచం ఏదో మహా విపత్తు వైపు క్రమంగా జారుతున్న వాతావరణం అతని నవలల నిండా పరుచుకుని ఉంటుంది. “మనం ఏ మహా ప్రళయం కోసమూ ఎదురు చూడనక్కర్లేదు.

# బాణాసంచా కేంద్రాల్లో నిబందనలు తప్పనిసరి




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పెద్దాపురం నియోజక వర్గంలో బాణాసంచా పరిశ్రమలో ప్రభుత్వ నిభందనలు పాటించాలని, పనిచేస్తున కార్మికులకు బీమా తప్పనిసరిగా చేయించాలని తహసిల్దార్‌లు చంద్రశేఖర్ రెడ్డి, వెంకట లక్ష్మిలు ఆదేశించారు. శనివారం సామర్లకోట, పెద్దాపురం పట్టణం, మండలాల్లో వేట్లపాలెం, హుస్సేన్‌పురం, జి మేడపాడు, పెద బ్రహ్మదేవం గ్రామాల్లోని బాణాసంచా తయారీ కేంద్రాలను రెవెన్యూ, ఫైర్, పోలీసు డిపార్ట్మెంట్ల అధికారుల బృందం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తయారీ కేంద్రల యజమానులతో మాట్లాడుతూ పరిశ్రమలో పనిచేసే కార్మికులకు భీమాను తప్పనిసరిగా చెల్లించాలని అన్నారు. నిబంధనలను ఉల్లంగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కేంద్రల వద్ద భద్రతా ఏర్పాట్లను, అనుమతి పత్రాలను వారు పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో సామర్లకోట సిఐ ఎ కృష్ణ భగవాన్, అగ్నిమాపక సహాయ డైరెక్టర్ శ్రీహరి జగన్నాదం, ఎస్ఐ మౌనిక రెవెన్యూ, అగ్ని మాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పేదల వైద్యానికి బ్రేకులు

### - కూటమి ప్రభుత్వ నిర్వాకం వల్లే దుస్థితి : జమ్మలమడక నాగమణి

### - వైద్యం చేయలేమని ఆస్పత్రుల ఎదుట బోర్డులు పెట్టడం దారుణం

**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో పేదల ఆరోగ్య పరిస్థితి కూటమి ప్రభుత్వ నిర్వాకం వల్ల అత్యంత దయనీయంగా మారిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో “నేడు ప్రభుత్వ వైఖరి వల్ల ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయే పరిస్థితి ఏర్ప డింది. నెట్‌వర్క్ ఆస్పత్రుల ఎదుట ‘వైద్యం చేయలేము’ అనే బోర్డులు పెట్టడం కూటమి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం” అని మండిపడ్డారు. “ఆరోగ్యశ్రీ నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకే వెళ్లి పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా, పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్న వైద్యం వ్యవస్థనే కూలదోసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. “చంద్రబాబు ప్రభుత్వం దివాళాకోరుతనానికి ఇది నిదర్శనం”... నాగమణి మరోసారి గుర్తు చేస్తూ “2014-19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం ఆరోగ్యశ్రీని నిర్లక్ష్యం చేసి, సుమారు రూ.700 కోట్లు బకాయిలుగా పెట్టి వెళ్లింది. ఇప్పుడు అదే ధోరణిని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఇప్పటికే రూ.3,000 కోట్లకు పైగా బకాయిలు ఉండటంతో 300కి పైగా ఆస్పత్రుల్లో సేవలు నిలిచి పోయాయని వివరించారు.



**జగన్ పాలనలో ఆరోగ్యశ్రీ విప్లవం - 25 లక్షల ఉచిత వైద్యం...**

“2024లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత, ఆరోగ్యశ్రీలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. రూ.5 లక్షలలోపు వార్షిక ఆదాయం ఉన్న ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. ఇది చరిత్రాత్మక నిర్ణయం” అని నాగమణి గుర్తు చేశారు. ఇంత ప్రజాహిత పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా చంద్రబాబు ప్రభుత్వం అడుగులు వేయడం దురదృష్టకరం” అంటూ ఆమె తీవ్రంగా విమర్శించారు.

# లబ్ధిదారునికి సీఎం.ఆర్.ఎఫ్ చెక్కు అందజేసిన మంత్రి - కొండపల్లి శ్రీనివాస్

### - చెక్కుపంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న చినకాద టిడిపి నాయకులు సిరివూరి నారాయణ మూర్తిరాజు



**గజపతినగరం/ దత్తిరాజేరు, (రాజధాని వార్తలు):** నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ లబ్ధిదారులకు సీఎంఆర్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా దత్తిరాజేరు మండలం చినకాద గ్రామానికి చెందిన ధూళి అప్పన్న రూ. 30,000. సీఎం ఆర్ ఎఫ్ సహాయ నిధి నుంచి పొందారు. ఈ చెక్కును గ్రామ నాయకులు సిరివూరి నారాయణ మూర్తిరాజు చేతుల మీదుగా లబ్ధిదారులకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అందజేశారు ఈ కార్యక్రమంలో దత్తి రాజేరు మండల పార్టీ అధ్యక్షులు చంద్ర, గజపతినగరం మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, పిఏసిఎస్ అధ్యక్షులు ఎల్.బంగారు నాయుడు, తుమ్మకపల్లి నాయకులు జి.గోవిందా తదితరులు పాల్గొన్నారు.

# పౌరసరఫరాల వ్యవస్థలో స్మార్ట్ కార్డుల ఏర్పాటు గర్వకారణం

**ఒంగోలు, (రాజధాని వార్తలు):** స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశ పెట్టడం ద్వారా పౌరసరఫరాల వ్యవస్థలో నూతన అధ్యా యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. ప్రస్తుత రేషన్ కార్డుల స్థానంలో క్యూ.ఆర్. కోడుతో కూడిన స్మార్ట్ రేషన్ కార్డుల జిల్లా స్థాయి పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు శనివారం కలెక్టరేట్లో నిర్వహిం చారు. మంత్రితోపాటు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు, జిల్లా కలెక్టర్ పి.రాజా బాబు, ఒంగోలు జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత ఇతర నాయకులు, ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిపాలనలో సాంకేతిక పరిజ్ఞానానికి అధిక ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, కుటుంబ సభ్యుల వివరాలు, వారు రేషన్ సరుకులు పొందే దుకాణ డీలర్ వివరాలతో ఏటీఎం కార్డు సైజులో స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశ పెట్టిందన్నారు. రేషన్ విధానాన్ని పటిష్టపరచి ఎం.డి.యు.వాహనాల స్థానంలో డీలర్ వ్యవస్థను పునరుద్ధరించి వృద్ధులు, వికలాంగుల ఇంటికే నేరుగా రేషన్ సరుకులను అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఒంటరి మహిళలకు, ట్రాన్స్ జెండర్లకు కూడా రేషన్ కార్డులను ఇచ్చామన్నారు. కూటమి ప్రభుత్వ 16 నెలల కాలంలోనే జిల్లాలో 20వేలకు పైగా కొత్త రేషన్ కార్డును మంజూరు చేసినట్లు చెప్పారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, సరుకులు అందించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నట్లు చెప్పారు. నెలలో ఎప్పుడైనా రేషన్ సరుకులు తీసుకునే వెసులుబాటు కల్పించామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజల ప్రయోజనాలకు ప్రభుత్వం పెద్దపీట



వేస్తున్నట్లు చెప్పారు. పెన్షన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, దీపం-2, స్త్రీశక్తి, ఆటో డ్రైవర్ల సేవలో వంటి కార్యక్రమాల ద్వారా ఆ వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 6,51,818 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పాఠశాలలు, హాస్టళ్లలోని విద్యార్థులకు భోజనం కోసం ఫైన్ క్వాలిటీ బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్నట్లు వివరించారు. రియాజ్ మాట్లాడుతూ వేలిముద్రల సమస్యలకు చెక్కు పెట్టేలా కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను అందుబాటులోకి తెచ్చిందన్నారు. సంక్షేమం పరంగా ఇది ఒక నూతన ఒరవడి అని ఆయన వ్యాఖ్యానించారు. మేయర్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞాన సహాయంతో వినూత్న నిర్ణయాలు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఇదే క్రమంలో స్మార్ట్ కార్డులను ప్రవేశ పెట్టడం సంతోషకరమన్నారు. అనంతరం స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు వారు అందించారు. జిల్లావ్యాప్తంగా వారం రోజుల్లో కార్డుల పంపిణీ ప్రక్రియను పూర్తి చేస్తామని డిఎస్ఓ పద్మశ్రీ తెలిపారు. ఒంగోలు ఆర్డీవో కళావతి, ఒంగోలు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ ఆర్.వెంకట్రావు, ఇతర అధికారులు, రేషన్ డీలర్లు, పలువురు లబ్ధిదారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అక్టోబర్ 14న గౌతమ బుద్ధుని విగ్రహావిష్కరణ..!



**డక్కిలి, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా, డక్కిలి మండలం తిరుపతి జిల్లా అంబేద్కర్ ధర్మ పోరాట సమితి (ఏ. డి. పి. ఎస్) అధ్యక్షులు గుండవోలు గోపాల్ మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 1956 అక్టోబర్ 14న నాగపూర్ నందు బౌద్ధాన్ని తీసుకుని ఐదు లక్షలు మందికి బౌద్ధాన్ని స్వీకరింపచేసి కుల నరకం నుండి విముక్తి కలిగించారు. అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ఆయుధంగా స్వీకరించిన మాస్టర్ ఇంగిలాల రామచంద్రరావు 1995 అంబేద్కర్ ధర్మ పోరాట సమితి స్థాపించి ఇప్పటికీ అనేక దపాలుగా సామూహిక బౌద్ధ దీక్ష కార్యక్రమాలు జరిపి, సుమారు 18 వేల మందికి బౌద్ధాన్ని స్వీకరింపజేసి సామాజిక సమానత్వాన్ని కి పునాదులు వేశారు. నాడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బౌద్ధాన్ని స్వీకరింప చేస్తే నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో అంబేద్కర్ ధర్మ పోరాట సమితి (ఏ. డి. పి. ఎస్ )ద్వారా మాస్టర్ ఇంగిలాల రామచంద్రరావు నాయకత్వంలో బౌద్ధాన్ని స్వీకరింప చేయడం చారిత్రాత్మక ఘట్టం. అందులో భాగంగా డక్కిలి మండలం, వేంబులూరు అంబేద్కర్ నగర్‌నందు అంబేద్కర్ ధర్మ పోరాట సమితి (ఏ. డి. పి. ఎస్) ఆధ్వర్యంలో అక్టోబర్ 14న ఉదయం 11 గంటలకు “గౌతమ బుద్ధుని విగ్రహావిష్కరణ జరుగుతున్నదని తెలిపారు. మరియు ఈ ఆవిష్కరణకు ఇండోర్ బౌద్ధ విహార్ నాగపూర్ మహారాష్ట్ర నుండి గౌరవనీయులు శ్రీ బంతేజి దమ్మానంద విచ్చేయుచున్నారు ముఖ్య అతిథులుగా అంబేద్కర్ ధర్మ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు (ఏ.డి.పి.ఎస్) ఇంగిలాల రామచంద్ర రావు మరియు అంబేద్కర్ ధర్మ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎరబోతు సుబ్రహ్మణ్యం ప్రత్యేక ఆహ్వానితులుగా అంబేద్కర్ ధర్మ పోరాట సమితి కార్యవర్గ సభ్యులు చిట్టేటి రమణయ్య, నిజమాల ప్రసాద్, జంగిటి వెంకటయ్య విచ్చేయుచున్నారు. కావున డక్కిలి మండలం మరియు వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని అంబేద్కర్ ధర్మ పోరాట సమితి నాయకులు, కార్యకర్తలు, అంబేద్కర్ బుద్ధిష్టులు, దళిత బహుజనులు, మేధావులు, నాయకులు, కార్యకర్తలు అందరూ విచ్చేసి గౌతమ బుద్ధుని విగ్రహ ఆవిష్కరణ సభను జయప్రదం చేయవలసిందిగా కోరడం జరిగింది.

# నిబంధనలు అతిక్రమించి, అక్రమంగా బాణసంచా తయారీ, విక్రయించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు : జిల్లా యస్.పి. అజిత వేజెండ్ల



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రజల శ్రేయస్సు కొరకు, బాణసంచా తయారీ కేంద్రాలు, స్టోరేజ్ గోడౌన్స్, మందు గుండు సామాగ్రి విక్రయించే దుకాణాలను మరియు పరిసర ప్రాంతాల భద్రతా పరమైన ప్రామాణికలను పాటిస్తున్నారా లేదా క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా యస్.పి. జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేసి, అక్రమ నిల్వలు చేసిన ఇందుకూరుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 2 కేసులు, విడవలూరు పరిధిలో-1 కేసు, కందుకూరు టౌన్ స్టేషన్ పరిధిలో-1 కేసు నమోదు చేసిన నెల్లూరు పోలీసులు. జిల్లాలో బాణసంచా తయారీ, విక్రయాలు చేసేవారు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండి, ప్రభుత్వ నియమ నిబంధలకు లోబడి బాణసంచా విక్రయించాలి. ముందస్తు జాగ్రత్త చర్యల వల్లనే ప్రమాదాలను నివారించగలం. జిల్లాలో అక్రమంగా తయారయ్యే టపాసులు, నిల్వ, సరఫరా, విక్రయాలు చేసే వారిపై ప్రత్యేక నిఘా.. అతిక్రమించి విక్రయించినా చట్ట ప్రకారం శిక్షార్హులు. బాణసంచా వంటి పేలుడు పదార్థాలు ఇంట్లో నిల్వ ఉంచరాదు.. బహిరంగ ప్రదేశాల్లో సంబంధిత అధికారులు కేటాయించిన ప్రదేశాలలో మాత్రమే, నిర్ణీత ప్రమాణాల మేరకు ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసుకొని విక్రయించుకోవాలి. బాణసంచా విక్రయ/తయారీ లైసెన్స్ కల్గిన దుకాణదారులు ప్రమాదాలు నివారణ కొరకు పాటించాల్సిన నియమ నిబంధనలు: ఫైర్ సేఫ్టీ ప్రికాషన్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతీ దుకాణం వద్ద రెండు అగ్ని నిరోధక సిలెండర్లు, రెండు బకెట్ల పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలి.. బాణసంచా సామాగ్రి తయారీ, నిల్వ కేంద్రాలు నివాస ప్రాంతాలకు, విద్యాసంస్థలకు, హాస్పిటల్స్ కు దూరంగా ఉండాలి. ఫైర్ అలారం సిస్టం ఏర్పాటుతో పాటు అత్యవసర పరిస్థితిలో అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించేలా ఆయా కేంద్రాల వారికి అవగాహన కలిగించాలి. మందు గుండు విక్రయ కేంద్రాలను అధికారులు అనుమతించిన ప్రదేశంలోనే ఏర్పాటు చేయాలి. 18 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన వారిని మందుగుండు సామాగ్రి తయారీ, నిల్వ కేంద్రాలలో పని చేయించరాదన్నారు. బాణసంచా దుకాణాలకు దూరంలో వాహనాలను నిలుపుకునేలా చూసుకోవాలి. ఆయా కేంద్రా లలో పనిచేసే వారికి ప్రమాద సమయంలో తీసుకోవలసిన చర్యలపై అవగాహన కలిగి ఉండాలి. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అక్రమ విక్రయాలు, తయారీ, నిల్వల సమాచారాన్ని ఉంటే స్థానిక పోలీసులకు లేదా పోలీస్ డయల్ 112 ద్వారా పోలీసులకు తెలియచేయాలని సూచన. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి.

# తెలుసు కదా ట్రైలర్: ఇద్దరి అమ్మాయిల మధ్యలో సిద్ధు బోల్డ్ ప్రేమకథ




సక్సెస్ ఫెయిల్యూర్స్ సంబంధం లేకుండా ప్రతీ సినిమాతో ఒక డిఫరెంట్ స్టోరీ లైన్‌ను టచ్ చేస్తున్నాడు సిద్ధు జొన్నలగడ్డ. అలాగే క్యారెక్టర్స్ విషయంలో కూడా కొత్త వేరియషన్స్ చూపించే ప్రయత్నం చేస్తున్నాడు. 'డీజే టిల్లు' సినిమాతో యూత్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో సిద్ధు జొన్నలగడ్డ, ఇప్పుడు దర్శకురాలిగా మారిన కోన నీరజతో 'తెలుసు కదా' అనే సినిమాతో సిద్ధమవుతున్నాడు. ఈ సినిమా ప్రమోషనల్ మెటీరియల్‌తో, ముఖ్యంగా ఎస్.థమన్ పాటలతో ఇప్పటికే బజ్ క్రియేట్ చేసింది. తాజాగా విడుదలైన ట్రైలర్, ఈ సినిమాపై ఆసక్తిని పెంచింది. సిద్ధు రొమాంటిక్ రిలేషన్‌షిప్స్, దాని వల్ల వచ్చే ఎమోషనల్ మూమెంట్స్ చుట్టూ అల్లిన ఈ కథ డిఫరెంట్‌గా ఉన్నట్లు అర్ధమవుతుంది. 'తెలుసు కదా' ట్రైలర్ చూస్తే, సిద్ధు పాత్ర కొత్తగా ఇంటెన్స్‌గా కనిపిస్తోంది. ట్రైలర్ మొదటి నుంచీ సిద్ధు, తన రొమాంటిక్ రిలేషన్‌షిప్స్ గురించిన ఉద్దేశాలను చెబుతూ పోతాడు. రాశీ ఖన్నా శ్రీనిధి శెట్టి ఇద్దరు హీరోయిన్స్‌తో సమాంతరంగా డేటింగ్ చేయడం, వారితో రిలేషన్‌షిప్స్ కొనసాగించడం చూపించారు. ఈ వ్యవహారం వల్ల అతనికి, అతని కుటుంబానికి కలిగే పరిస్థితులను చాలా బాగా క్యాప్చర్ చేశారని తెలుస్తోంది.?దర్శకురాలు నీరజ కోన ఈ సినిమాలోని ప్రతి సన్నివేశాన్ని చాలా ఎస్తెటిక్‌గా చిత్రీకరించారు. విజువల్స్, స్టైలిష్ ఫ్రేమ్స్ సినిమాకు ఒక కొత్త ఆకర్షణను తీసుకొచ్చాయి. సిద్ధు తన చార్మ్‌తో ఈ భిన్నమైన పాత్రను చాలా ఈజీగా హ్యాండిల్ చేశాడు. అతని ఎమోషనల్ పర్ఫార్మెన్స్ ఈ ట్రైలర్‌కు ఒక హైలైట్‌గా నిలిచాయి. ట్రైలర్‌లో అయితే స్టోరీ లైన్ ఏంటనేది పూర్తిగా రివీల్ చేయలేదు.

ఎమోషన్స్ ఎప్పుడూ మన కంట్రోల్‌లోనే ఉండాలి, ప్రేమించిన వాళ్లకు అస్సలు ఇవ్వకూడదు అనుకునే మనస్తత్వంతో సిద్ధు ఉంటాడు. అలాంటి అబ్బాయి ఇద్దరమ్మాయిలతో డేటింగ్‌లోకి వెళ్లే క్రమంలో అతని ఎమోషన్స్ ఏ విధంగా మారతాయి అనే క్యూరియసిటిని క్రియేట్ చేశారు. ఇక వైవా హర్ష కాంబినేషన్ రెగ్యులర్ కామెడి టోన్‌లో కాకుండా కథలో హీరో భావాలను హైలెట్ చేసేలా ఉంది. ఇక హీరోయిన్స్ హీరో తో కలిసి ఎలా జర్నీ చేస్తారు? ఇంతకీ వీరి మధ్య ఏం జరిగింది? అనేది సినిమా చూస్తేనే తెలియాలి. చూస్తుంటే రెగ్యులర్ లవ్ స్టోరీ అయితే అనిపించడం లేదు. మరోవైపు, ఈ సినిమాకు థమన్ అందించిన బీజీఎం పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రొడక్షన్ వాల్యూస్ సినిమా క్వాలిటీని పెంచాయి. ఇక దీపావళి వీకెండ్‌లో గ్రాండ్‌గా రిలీజ్ అవుతున్న సినిమాల్లో తెలుసు కదా.. ఇంపాక్ట్ క్రియేగ్ చేసేలా కనిపిస్తోంది. ట్రైలర్‌లో ఉన్న ప్రత్యేకత సినిమాల్లో ఉంటే కచ్చితంగా యూత్ ఆడియెన్స్‌ను భారీగా థియేటర్స్‌కు లాగే ఛాన్స్ ఉంది.

# రవితేజ బయోపిక్.. అతను ఎందుకు ఆగిపోయాడంటే?



ప్రముఖులపై బయోపిక్‌లు చేయడం కొన్నేళ్లుగా సినిమా రంగంలో ట్రెండ్‌గా మారింది. ఇలా మాహానటి సావిత్రి జీవిత కథను తెరకెక్కించి సూపర్ సక్సెస్ అయ్యారు దర్శకుడు నాగ్ అశ్విన్. ఆ తర్వాత తెలుగులో పలువురు ప్రముఖుల బయోపిక్‌లు వచ్చాయి కానీ, అవి అంతగా విజయం సాధించలేదు. అయితే మళ్లీ ఈ బయోపిక్‌ల టాపిక్ తెరపైకి రావడానికి కారణం యంగ్ హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా తెలుసు కదా ప్రమోషన్స్ లో భాగంగా రీసెంట్‌గా మాస్ మహారాజ రవితేజ తో ఇంటర్వ్యూ చేశారు. ఈ ఇంటర్వ్యూలో సిద్ధు.. తనకు రవితేజ అంటే ఇష్టం అని చెప్పాడు. అలాగే ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా అసిస్టెంట్ డైరెక్టర్, చిన్న చిన్న పాత్రల నుంచి హీరోగా ఎదిగారు రవితేజ. అలా ఆయన ఇండస్ట్రీలోకి వచ్చి హీరోగా ఎదిగిన తీరును బయోపిక్‌గా తీసి తెరకెక్కించాలని ఒకప్పుడు సిద్ధు భావించారట.

ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ఇంటర్వ్యూలో చెప్పారు. తన సినిమా కృష్ణ అండ్ హీజ్ లీల సినిమా తర్వాత రవితేజ బయోపిక్ చేయాలని గట్టిగా ప్లాన్ చేశారట. కొన్ని రోజులు దీనిపై పని చేశారట. కానీ, ఆ తర్వాత కొన్ని కార ణాల వల్ల ప్లాన్ విరమించుకున్నానని సిద్ధు చెప్పారు. అయితే ఇది విన్న రవితేజ కూడా బయోపిక్‌లపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. బయోపిక్స్ సినిమాల్లో ఒక మనిషికి సంబంధించిన అన్ని అంశాలు చూపించాలి. కానీ ఇక్కడ పాజిటివ్ కోణంలోనే ఉంటున్నాయి. అలాకాకుండా ఆ మనిషిలోనీ నెగెటివ్స్ కోణాన్ని కూడా చూపించాలి అని రవితేజ అన్నారు. అలాగే తాను కూడా ఒక నటుడి బయోపిక్ తెరెకెక్కించాలని అనుకున్నారట. ఎవరి బయోపిక్ అని అడగ్గా.. తాను ఆ నటుడు ఎవరో చెప్పలేదు. కాగా, ఈ ఇద్దరికి తాజా సినిమాలు ఈ నెలలో థియేటర్లలోకి రానున్నాయి. అక్టోబర్ 17న సిద్ధు నటించిన తెలుసు కదా రిలీజ్ కానుంది. నీరజ కోన తెరకెక్కించిన ఈ సినిమాలో రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటించారు. మరోవైపు రవితేజ మాస్ జాతర సినిమా రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. ఆ సినిమా ఇదే నెల 31న విడుదల కానుంది.

# బేబమ్మ కెరీర్ డిసైడ్ చేసే సినిమాలు..!



ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌లో తొలి సినిమాతోనే పాపులర్ అయ్యింది కృతి శెట్టి. ఆ సినిమా తర్వాత శ్యాం సింగ రాయ్, బంగార్రాజు సినిమాలు సక్సెస్ వచ్చినా ఆ తర్వాత మొదలైంది అసలు సినిమా. అప్పటి నుంచి లాస్ట్ ఇయర్ వచ్చిన మనమే వరకు కూడా కృతి శెట్టి సినిమా అంటే అది ఫ్లాపే అన్న విధంగా రిజల్ట్ ఉండేది. తెలుగులో స్టార్ డం వస్తే ఆ ఇంపాక్ట్ పాన్ ఇండియా లెవెల్‌లో ఉంటుందని గుర్తించి ఇక్కడ అవకాశాల కోసం ఎదురు చూస్తుంది అమ్మడు. ఐతే ఈలోగా కోలీవుడ్ నుంచి ఆఫర్స్ రాగా అవి చేస్తూ వస్తుంది కృతిశెట్టి. తమిళ్‌లో మొదట సైన్ చేసిన సినిమా జినీ. రవి మోహన్ లీడ్ రోల్‌లో వస్తున్న ఈ సినిమాలో కృతి శెట్టితో పాటు కళ్యాణి ప్రియదర్శన్ కూడా మరో హీరోయిన్‌గా చేస్తుంది. ఈ సినిమాతో పాటు ఎల్.ఐ.కె. అంటూ ప్రదీప్ రంగనాథన్‌తో ఒక యూత్ ఫుల్ మూవీ చేస్తుంది అమ్మడు. విఘ్నేష్ శివన్ ఈ సినిమాను డైరెక్ట్ చేస్తున్నారు. ఇక ఈ సినిమా తర్వాత కార్తితో వా వాతియార్ కూడా చేస్తుంది. ఐతే కృతిశెట్టి లక్కో ఏమో కానీ ఈ 3 సినిమాలు ఒకే మంత్‌లో రాబోతున్నాయి. కార్తి వా వాతియార్ డిసెంబర్ 5 వస్తుంటే.. ప్రదీప్ తో చేసిన ఎల్.ఐ.కె డిసెంబర్ 18న రిలీజ్ అవుతుంది. ఈ రెండిటితో పాటు రవి మోహన్ జినీ కూడా అటు ఇటుగా డిసెంబర్‌లోనే రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. కోలీవుడ్‌లో ఈ 3 సినిమాలతో తన టాలెంట్ చూపించబోతుంది అమ్మడు. కృతి శెట్టి కి ఈ 3 సినిమాలే చివరి అవకాశమని చెప్పొచ్చు. వీటిలో ఏది వర్క్ అవుట్ అయినా అమ్మడికి మరిన్ని అవకాశాలు వస్తాయి. ఒకవేళ తేడా వస్తే మాత్రం ఇక కెరీర్ చాలా రిస్క్‌లో పడినట్టు అవుతుంది. ఉప్పెన సినిమా తర్వాత వచ్చిన ప్రతి సినిమా చేస్తూ వచ్చింది కృతి. ఐతే అందులో కథాబలం ఉన్న సినిమాలు ఉన్నా ఎందుకో అమ్మడి బ్యాడ్ లక్ వల్ల వర్క్ అవుట్ కాలేదు. ఐతే తమిళ్‌లో రాబోతున్న 3 సినిమాలు ఒకదానికి మించి మరొకటి అనేలా ఉన్నాయి. ఆ సినిమాల్లో ఏ సినిమా సక్సెస్ అయినా కృతికి మళ్లీ మంచి క్రేజ్ వస్తుంది. తెలుగులో అమ్మడికి మంచి ఫాలోయింగ్ ఉన్నా అది సినిమా సక్సెస్ చేయడానికి సరిపోవట్లేదని మేకర్స్ అమ్మడిని పక్కన పెట్టేశారు.

# చీరకట్టులో సుహానా అందాలు.. ఏముందిరా బయ్!



ఫాలోవర్స్‌లో పాపులారిటీ దక్కించుకోవాలి అంటే నిత్యం చిట్టి పొట్టి బట్టలు వేసి అందాలను ఎరగా వేయడమే కాదు.. చీరకట్టులో కూడా అందాలు వలకబోస్తూ ఆకట్టుకోవచ్చని ఈ మధ్యకాలంలో పలువురు భామలు నిరూపిస్తున్నారు. సాంప్రదాయానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఈ చీరకట్టులో కూడా అందాలను చూపిస్తూ అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. అసలే చీరకు ఎంతోమంది ఫాన్స్ ఉన్నారు. అలాంటిది తమ అభిమాన హీరోయిన్స్ ఇలా చీరకట్టులో కనిపిస్తే ఫ్యాన్స్ తట్టుకోగలరా? అమాంతం లైక్, షేర్ చేసేయరు.. ఇప్పుడు సరిగ్గా అలాగే చేస్తున్నారు కూడా. ఈ క్రమంలోనే ఇలా చీరకట్టులో అభిమానులను ఆకట్టుకుంటూ మరింత పాపులారిటీ తెచ్చుకుంటున్న భామలలో సుహానా ఖాన్ కూడా ఒకరు. బాలీవుడ్ బాద్షాగా భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న షారుక్ ఖాన్ కూతురిగా తనకంటూ ఒక గుర్తింపును అందుకుంది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం సోషల్ మీడియాలో యాక్టివ్ అవ్వడానికి ప్రయత్నం చేస్తున్న సుహానా ఖాన్. అందులో భాగంగానే పర్పుల్ కలర్ చీరలో తన అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. ఎప్పుడు మోడ్రన్ డ్రెస్సుల్లో కనిపించే సుహానా ఖాన్ ఇలా సడన్గా చీరలో కనిపించేసరికి అభిమానులు సైతం ఆమె అందాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. పక్కా హీరోయిన్ మెటీరియల్ అంటూ ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. సుహానా ఖాన్.. 2000 సంవత్సరంలో మే 22వ తేదీన ప్రముఖ నటుడు షారుక్ ఖాన్, నిర్మాత గౌరీ ఖాన్ దంపతులకు జన్మించింది. ఈమె సోదరుడు ఆర్యన్ ఖాన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇటీవలే ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్ అనే వెబ్ సిరీస్ తో భారీ పాపులారిటీ సొంతం చేసుకున్నారు. అంతేకాదు అబ్రామ్ అనే తమ్ముడు కూడా ఉన్నారు. ఈమె తల్లిదండ్రులు ముస్లిం, హిందూ మతాలను అనుసరిస్తారు అన్న విషయం అందరికీ తెలిసిందే. ముంబైలోని ధీరూబాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్లో స్కూల్ విద్యను అభ్యసించిన ఈమె.. ఆర్డింగ్లీ కళాశాల నుండి ఉన్నత పాఠశాలలో పట్టభద్రురాలయ్యింది. న్యూయార్క్‌లోనే న్యూయార్క్ విశ్వవిద్యాలయం డిష్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చదివింది. తండ్రి స్టార్డం కారణంగా పుట్టుకతోనే మీడియా దృష్టిని ఆకర్షించిన ఈమె.. 2018లో ఓగ్ ఇండియా కవర్ పేజీపై దర్శనమిచ్చింది. అలాగే ది గ్రేట్ పార్ట్ ఆఫ్ బ్లూ అనే షార్ట్ ఫిలిమ్ ద్వారా నటన రంగ ప్రవేశం చేసింది. అంతేకాదు సౌందర్య సాధనాలు సంస్థ అయినా మేబెల్లైన్ న్యూయార్క్, రిలయన్స్ రిటైల్ కాస్మోటిక్ బ్రాండ్ టిరాకి బ్రాండ్ అంబాసిడర్ గా బాధ్యతలు చేపట్టింది. ఖుషి కపూర్ నటించిన ది ఆర్చీస్ అనే సినిమా ద్వారా నటిగానే కాకుండా గాయకురాలిగా కూడా పనిచేసింది. మొత్తానికైతే తండ్రి బాటలోనే ఇప్పుడు సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తుంది ఈ ముద్దుగుమ్మ.

# క్యాబినెట్ నిర్ణయాలు

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన 32 వ ఇ-క్యాబినెట్ సమావేశంలో పలు అంశాలపై తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనం ప్రచార విభాగంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మాత్యులు కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు. నేడు జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో 1,27,181 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు మరియు 78,771 ఉద్యోగాలకు ఆమోదం లభించింది. అనకాపల్లి జిల్లాలో అధునాతన కార్బన్ కాంప్లెక్స్ తయారీ, పలనాడు జిల్లాలో సిమెంట్ ప్లాంట్ మరియు గుడిపల్లి మరియు టేకులోడు (అనంతపురం జిల్లా)లో ఏరోస్పేస్ & ఆటోమోటివ్ కాంపోనెంట్ తయారీ పరిశ్రమల స్థాపనకు ఆమోదం లబించింది. ఈ ప్రాజెక్టులు మొత్తం 5,800 కోట్ల రూపాయల పెట్టుబడి లక్ష్యంగా 6,646 మందికి ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. ప్రకాశం జిల్లాలో ప్రొపెల్లెంట్ ప్లాంట్‌కు, కర్నూలు జిల్లాలో పారిశ్రామిక ఎస్టేట్ అభివృద్ధికి, విశాఖపట్నం జిల్లాలో పారిశ్రామిక & లాజిస్టిక్స్ హబ్‌కు, కర్నూలు జిల్లాలో ఇన్నోవేషన్ సెంటర్ కు, విజయనగరం జిల్లాలో ప్రైవేట్ మెగా పార్క్‌కు భూమి కేటాయింపుకు అనుమతులు ఇవ్వబడ్డాయి. 56,353 ఉద్యోగ అవకాశాల కల్పన లక్ష్యంగా 8,186 కోట్ల రూపాయల పెట్టుబడులను అవకాశం కల్పిస్తూ ఈ కేటాయింపులు జరిగాయి. ఇతర ముఖ్యమైన ప్రాజెక్టులలో విశాఖపట్నంలో డేటా సెంటర్ మరియు ఐటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేయడానికి ఆమోదం లబించింది. అమరావతిలో 4-స్టార్ హోటళ్లు, విశాఖపట్నం జిల్లా అరకు వ్యాలీలో ఒక లగ్జరీ రిసార్ట్, శ్రీశైలం (నంద్యాల జిల్లా)లో 3-స్టార్ హోటల్ మరియు కాకినాడ జిల్లాలో ఒక కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం లబించింది. సౌర విద్యుత్ మరియు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు అనంతపురం, విజయనగరం, కర్నూలు మరియు నంద్యాల జిల్లాల్లోను, కర్నూలు, ఏలూరు మరియు చిత్తూరు జిల్లాల్లో ఆహార ప్రాసెసింగ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆమోదం లబించింది. జూన్ 2024లో ఈ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రాష్ట్ర మంత్రివర్గం 149 ప్రతిపాదనలను ఆమోదించి INR 7.37 లక్షల కోట్ల పెట్టుబడులకు మరియు 6.97 లక్షల ఉపాధి కల్పనకు అవకాశం కల్పించడం జరిగింది.

**01. ఇంధన శాఖ:**

కర్నూల్ & నంద్యాల జిల్లాల్లో ఇప్పటికే ఆమోదించిన 349.50 MW సామర్థ్యానికి M/s ఆంపిన్ ఎనర్జీ ట్రాన్సిషన్ ప్రైవేట్ లిమిటెడ్ విండ్ సోలార్ హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం ముందుగా కేటాయించిన సరిహద్దుల్లోనే 1.80 MW విండ్ మరియు 0.50 MW AC సోలార్ సామర్థ్యాలను 349.50 MW సామర్థ్యానికి పెంచేందుకు M/s ఆంపిన్ ఎనర్జీ ట్రాన్సిషన్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క గ్రూప్ కంపెనీలు అయిన M/s ఆంపిన్ ఎనర్జీ ట్రాన్సిషన్ ప్రైవేట్ లిమిటెడ్ అభ్యర్థనపై చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. పునరుత్పాదక ఇంధన విద్యుత్ ప్రాజెక్టులు పర్యావరణ అనుకూలమైనవి మరియు ఇంధన భద్రతను నిర్ధారిస్తాయి. పవన టర్బైన్ల ఎంపిక మరియు గ్రిడ్ కనెక్టివిటీ అవసరాల కారణంగా మంజూరు చేయబడిన సామర్థ్యాలలో పవన మరియు సౌర సామర్థ్యాలను పెంచాల్సిన అవసరం ఉంది. ఇరవై ఐదు సంవత్సరాలకు రూ. 0.72 కోట్లు గ్రీన్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఫండ్, ఎకరానికి రూ. 50,000 చొప్పున స్థానిక ప్రాంత అభివృద్ధి ఛార్జీలు వసూలు చేయబడతాయి. గతంలో మంజూరు చేయబడిన 1200 మంది సభ్యులకు అదనంగా సుమారు ఐదు మంది సభ్యులకు ప్రత్యక్ష మరియు పరోక్ష ఉపాధి కల్పించబడుతుంది.

02. ఇంధన శాఖ:

M/s చింత గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ చేసిన అభ్యర్థనపై రెండు ప్రతిపాదనలు అనగా: (1) విజయనగరం జిల్లా మక్కువ మండలం దుగ్గేరు వద్ద 2000 MW దుగ్గేరు PSP ప్రాజెక్ట్ కేటాయింపునకు మరియు (2) AP ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 కింద దుగ్గేరు PSP కోసం జలవనరుల శాఖ మార్గదర్శకాలు మరియు లభ్యతకు అనుగుణంగా వెంగళరాయ సాగర్/ వెంగళ రావు సాగర్ II/ తోటపల్లి రిజర్వాయర్ల నుండి వన్‌టైమ్ ఫిల్లింగ్ కోసం 24 MCM నీటి కేటాయింపు మరియు వార్షిక ఆవిరి నష్టాలకు 1.50 MCM నీటి కేటాయింపునకు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ భారీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు నుండి నలభై సంవత్సరాలకు రూ. 1,230 కోట్లు గ్రీన్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఫండ్ ఉత్పత్తి అవుతుంది. ఎకరానికి రూ. 50,000 చొప్పున స్థానిక ప్రాంత అభివృద్ధి ఛార్జీలు వసూలు చేయబడతాయి. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు మూడు వేల మంది సభ్యులకు ప్రత్యక్ష మరియు పరోక్ష ఉపాధి కల్పించబడుతుంది.

03. ఇంధన శాఖ:

AP ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 కింద అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలం ఎర్రగూడి, అవులెన్న, సిరిపి, దూదెకుంట, అంకంపల్లి మరియు తగుపార్తి గ్రామాల్లో 400 MW AC/ 560 సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం M/s టాటా పవర్ రీన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ అభ్యర్థనపై చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఇతర డెవలపర్ల RE పవర్ సామర్థ్యాలు మరియు విండ్ రిసోర్స్ అసెస్‌మెంట్ స్టడీలకు కేటాయించిన ప్రాంతాలతో అతివ్యాప్తి లేకుండా ఈ కేటాయింపు జరుగుతుంది. ఈ సౌర విద్యుత్ ప్రాజెక్టు నుండి ఇరవై ఐదు సంవత్సరాలకు రూ. 126 కోట్ల గ్రీన్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఫండ్ ఉత్పత్తి అవుతుంది. పన్నెండు సంవత్సరాలకు రూ. 1.50 లక్షలు/మెగావాట్ చొప్పున మరియు మిగిలిన పదమూడు సంవత్సరాలకు సంవత్సరానికి రూ. 50,000 చొప్పున స్థానిక ప్రాంత అభివృద్ధి ఛార్జీలు వసూలు చేయబడతాయి. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు వెయ్యి మూడు వందల ఎనభై మంది సభ్యులకు ప్రత్యక్ష మరియు పరోక్ష ఉపాధి కల్పించబడుతుంది.




04. ఇంధన శాఖ:

AP ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 కింద అనంతపురం జిల్లా వజ్రకరూర్ మండలం కమలపాడు, కొనకొండ్ల మరియు గుల్లపాలెం గ్రామాల్లో 600 MWh BESS తో పాటు 400 MW AC/ 580 MWp DC సోలార్ పవర్ ప్రాజెక్ట్ కేటాయింపు కోసం M/s ACME ఉర్జా వన్ ప్రైవేట్ లిమిటెడ్ అభ్యర్థనపై చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఇతర డెవలపర్లకు ఇప్పటికే కేటాయించిన RE పవర్ సామర్థ్యాలు మరియు విండ్ రిసోర్స్ అసెస్‌మెంట్ స్టడీల ప్రాంతాలతో అతివ్యాప్తి లేకుండా ఈ కేటాయింపు జరుగుతుంది.

05. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ శాఖ:

మధ్య తరహా సంస్థలకు భూమి కేటాయింపు విధానానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్స్ పాలసీ (4.0) 2024-29కు సవరణ చేసేందుకు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ టెక్ హబ్‌లకు భూమి ప్రోత్సాహకం విధానం (4.0) 2024-29 టైర్-2 నగరాల్లో రాష్ట్ర పోటీతత్వాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధానం మధ్య తరహా సంస్థలు మరియు అభివృద్ధి చెందుతున్న రంగాలకు ఎకరానికి రూ.4 కోట్ల చొప్పున పెట్టుబడికి సిద్ధంగా ఉన్న భూమిని అందిస్తుంది, 500 ఉద్యోగాలు మరియు 12 నెలల్లో ప్రాజెక్ట్ కార్యాచరణకు హామీ ఇస్తుంది. IT/ITES, GCCలు, డేటా సెంటర్లు, క్లౌడ్ & వర్క్‌ప్లేస్ సొల్యూషన్స్ మరియు IT ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లను లక్ష్యంగా చేసుకుని పారిశ్రామిక వృద్ధిని పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రాంతీయ ఉపాధి కల్పన, అభివృద్ధి, ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న సమతుల్య మరియు పెట్టుబడి కేంద్రంగా ఉంచడం లక్ష్యం.

06. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ శాఖ:

విశాఖపట్నం జిల్లా భీమిలిలోని కాపులుప్పాడలోని సర్వే నంబర్ 401 వద్ద ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎకరానికి 2 కోట్ల రూపాయల చొప్పున 4.05 ఎకరాల భూమిని APIIC ద్వారా కేటాయించడానికి మరియు AP IT & GCC పాలసీ (4.0) 2024-29 ప్రకారం ఈ ప్రాజెక్టును పరిగణనలోకి తీసుకోవడానికి మరియు రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక బోర్డు సిఫార్సు చేసిన విధంగా 140 కోట్ల రూపాయల ప్రతిపాదిత పెట్టుబడికి ప్రోత్సాహకాలను అందజేయడానికి తద్వారా 2,600 ఉద్యోగాల కల్పనకు అవకాశం కల్పించేందుకు ఐ.టి.ఇ. & సి. శాఖ చేసిన ప్రతిపానకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది. దీని ద్వారా నూట నలభై కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టి రెండు వేల ఆరు వందల ఉద్యోగాలను సృష్టించనుంది. AP IT & GCC పాలసీ 4.0లో పేర్కొన్న కనీస అర్హత ప్రమాణాలను గణనీయంగా మించి, దాని రాబోయే 4.05 ఎకరాల సౌకర్యం ద్వారా లాజిస్టిక్స్ మరియు సప్లై చైన్ డొమైన్‌లో IT సేవలను అందించనుంది. ఈ పెట్టుబడి స్థానిక IT పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, అనుబంధ పరిశ్రమలు, సేవా ప్రదాతలు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధిని కూడా ఉత్ప్రేరకపరుస్తుంది. సృష్టించబడిన IT ఉద్యోగాలు అధిక-విలువైన ఉపాధి అవకాశాలను అందిస్తాయి, డిజిటల్ నైపుణ్య అభివృద్ధిను పెంపొందిస్తాయి మరియు ఈ ప్రాంతంలో సమ్మిళిత ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తాయి.

07. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ శాఖ:

రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక బోర్డు సిఫార్సు చేసిన విధంగా INR 87,520 కోట్ల ప్రతిపాదిత పెట్టుబడి ద్వారా మెస్సర్స్ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్-పవర్డ్ డేటా సెంటర్లను ఏర్పాటు చేయడానికి విశాఖపట్నం జిల్లాలోని అడవివరం మరియు తర్లువాడ గ్రామాలు మరియు అనకాపల్లి జిల్లాలోని రాంబిల్లిలలో 480 ఎకరాల భూమిని మరియు ప్రత్యేక ప్రోత్సాహకాలను కేటాయించడానికి తద్వారా 200 ప్రత్యక్ష ఉద్యోగాల కల్పనకై ఐ.టి.ఇ. & సి. శాఖ చేసిన ప్రతిపానకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది. గూగుల్ అనుబంధ సంస్థ అయిన రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ. 87,520 కోట్ల భారీ పెట్టుబడితో నాలుగు వందల ఎనభై ఎకరాల్లో విస్తరించి ఉన్న అత్యాధునిక డేటా సెంటర్ సౌకర్యాలను స్థాపించనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా రెండు వందల ప్రత్యక్ష ఉద్యోగాలతో పాటు వేలాది పరోక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయి. నెదర్లాండ్స్, వర్జీనియా మరియు తైవాన్ వంటి ప్రాంతాలలో గూగుల్ డేటా సెంటర్ పెట్టుబడులు స్థిరంగా పరివర్తన ప్రయోజనాలను అందించిన నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ కూడా ఇలాంటి అభివృద్ధి లాభాలను అనుభవించడానికి సిద్ధంగా ఉంది. ఈ డేటా సెంటర్ సౌకర్యాలు నిర్మాణం, తయారీ మరియు IT సేవలు వంటి రంగాలలో అధిక నాణ్యత గల ఉపాధిని సృష్టిస్తాయి. అదే సమయంలో రాష్ట్ర డిజిటల్ మౌలిక సదుపాయాలను గణనీయంగా పెంచుతాయి. అధునాతన సాంకేతికతలు మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ఆధారిత సామర్థ్యాల ఉనికి ఆవిష్కరణలను వేగవంతం చేస్తుంది, మరింత పెట్టుబడులను ఆకర్షిస్తుంది మరియు స్థానిక సంస్థలకు సాంకేతిక శక్తిని అందిస్తుంది.

08. M/S JSW ఇండస్ట్రియల్ పార్క్ లిమిటెడ్ - ప్రైవేట్ మెగా పార్క్ విజయనగరం జిల్లాలో 1,166.43 ఎకరాల్లో ప్రైవేట్ మెగా ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి చేయడానికి M/s JSW ఇండస్ట్రియల్ పార్క్ లిమిటెడ్ ప్రతిపాదనను ఆమోదించింది. రూ. 531 కోట్ల పెట్టుబడితో, ఈ మల్టీ-యూటిలిటీ MSME పార్క్ 45 వేల ఉద్యోగాలను సృష్టిస్తుంది. శృంగవరపుకోట మండలంలోని మూసిడిపల్లి, చీడిపాలెం, చినకందేపల్లి, ఎం.బి. వార మరియు కిల్తంపాలెం గ్రామాల్లో స్థాపించబడే ఈ పార్క్‌లో వస్త్రాలు, వ్యవసాయ ప్రాసెసింగ్, ఎలక్ట్రిక్ వాహన తయారీ, గ్రీన్ హైడ్రోజన్ మరియు లాజిస్టిక్స్ సౌకర్యాలు ఉంటాయి. ఎకరాకు మూడు లక్షల క్యాపిటల్ సబ్సిడీ మరియు భూమి మార్పిడి, వినియోగ మార్పు మరియు లేఅవుట్ ఆమోదం ఛార్జీలలో వంద శాతం మినహాయింపు మంజూరు చేయబడింది.

09. M/S ఫెయిర్ ఎక్స్‌పోర్ట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ - మల్లవల్లి ఫుడ్ పార్క్

లూలూ గ్రూప్‌లో భాగమైన M/S ఫెయిర్ ఎక్స్‌పోర్ట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌కు మల్లవల్లి మెగా ఫుడ్ పార్క్‌లోని 7.48 ఎకరాల కోర్ ప్రాసెసింగ్ సెంటర్‌ను 66 సంవత్సరాలకు సంవత్సరానికి రూ. 50 లక్షలకు లీజుపై అలాగే, ప్రతి ఐదు సంవత్సరాలకు ఐదు శాతం పెంపుదలతో కేటాయించడం జరిగింది. పండ్ల ప్రాసెసింగ్ లైన్లు, మూడు వేల మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజ్, రైపెనింగ్ చాంబర్లు మరియు వేర్‌హౌసింగ్ సామర్థ్యంతో కూడిన ఈ అత్యాధునిక సౌకర్యం స్థానికంగా సేకరించిన వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెస్ చేస్తుంది.

10. M/S ఎమ్మెన్నార్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ - జరిమానా మినహాయింపు

అనకాపల్లిలోని JN ఫార్మసిటీలో M/S ఎమ్మెన్నార్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ. 18.09 కోట్ల ప్రాజెక్టు అమలు ఆలస్యానికి విధింపబడిన జరిమానా రుసుములలో మినహాయింపును ఆమోదించింది. కంపెనీ 22.18 ఎకరాల్లో నిర్మాణాన్ని పూర్తి చేసి, రూ. 160 కోట్లు పెట్టుబడి పెట్టి, రూ. 198 మందికి ఉపాధి కల్పించనుంది. మూడు అనుబంధ సంస్థలు ఆవరణలో తయారీ సౌకర్యాలను నిర్వహించేలా మొత్తం విస్తీర్ణానికి సేల్ డీడ్ అమలు చేయబడుతుంది.

11. M/S భారత్ డైనమిక్స్ లిమిటెడ్ - రక్షణ తయారీ సౌకర్యం

రక్షణ మంత్రిత్వ శాఖ సార్వజనిక రంగ సంస్థ అయిన M/S భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌కు ప్రకాశం జిల్లా దోనకొండ గ్రామంలో ప్రొపెల్లెంట్ ఉత్పత్తి సౌకర్యం మరియు ఆయుధ వ్యవస్థ ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్ స్థాపించడానికి 1,400 ఎకరాలు కేటాయించడం జరిగింది. రెండు దశల్లో రూ. 1200 కోట్ల పెట్టుబడితో 1400 ఉద్యోగాలను సృష్టించే ఈ ప్రాజెక్టులో తయారీ సౌకర్యం కోసం 1,200 ఎకరాలు స్వాధీనంలో ఉన్న భూమికి ఎకరాకు రూ. 7.73 లక్షలు, మిగిలినవి వాస్తవ కొనుగోలు ధరతో మరియు టౌన్‌షిప్ అభివృద్ధికి అదనంగా 146.67 ఎకరాలు కేటాయించడం జరిగింది.

12. ప్రధాన పారిశ్రామిక ప్రాజెక్టుల అదనపు అభ్యర్థనలు

మంత్రివర్గం నాలుగు ప్రధాన పరిశ్రమల అదనపు అభ్యర్థనలను ఆమోదించింది. అనకాపల్లిలో యాభై ఐదు వేల కోట్ల ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ కోసం M/S ఆర్సిలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా లిమిటెడ్‌కు దశల వారీగా చేసిన భూమి చెల్లింపులపై రూ. 12.58 కోట్ల వడ్డీ మినహాయింపు మంజూరు చేయబడింది. రామయపట్నం రిఫైనరీ స్థలంలో రోడ్డు రీఅలైన్‌మెంట్ కోసం M/S భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ అభ్యర్థన ఆమోదించబడింది, అభివృద్ధి వ్యయం రూ. 113 కోట్లను BPCL భరిస్తుంది. నాయుడుపేటలో కార్బన్ బ్లాక్ ప్లాంట్ కోసం M/s PCBL కెమికల్ లిమిటెడ్ యొక్క రూ. 2,717 కోట్ల సవరించిన పెట్టుబడి ప్రతిపాదన సర్దుబాటు చేసిన కాలపరిమితులతో అంగీకరించబడింది. M/S భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ మార్చి 2029 నాటికి రూ. 1400 కోట్లు పెట్టుబడికి సంబంధించిన ప్రోత్సాహకాల అభ్యర్థన ఆమోదించబడింది.

13. కొత్త పారిశ్రామిక కేటాయింపులు

మూడు కొత్త కంపెనీలకు భూమి కేటాయింపులు ఆమోదించబడ్డాయి. M/S అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంట్రప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియాకు 36.25 కోట్ల పెట్టుబడితో మహిళా శక్తి భవన్ మరియు మహిళా పారిశ్రామిక ఎస్టేట్ స్థాపించడానికి కర్నూల్ ఓర్వకల్‌లో ముప్పై ఎకరాలను ఎకరాకు పది లక్షలకు కేటాయించడం జరిగింది, ఇది మూడు వేల మంది మహిళా వ్యవసాయ వేత్తలకు ఉద్యోగాలను సృష్టిస్తుంది. M/S అవంతి వేర్‌హౌ సింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ. 319 కోట్ల పెట్టుబడితో పారిశ్రామిక లాజిస్టిక్స్ హబ్ దశ-1 కోసం విశాఖపట్నంలోని గుర్రంపాలెంలో ఇరవై ఎకరాలు ఎకరాకు ఎనభై లక్షలకు కేటాయించబడ్డాయి. M/S ఆక్సెల్ESG (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌కు AI-ఆధారిత పర్యావరణ పర్యవేక్షణ వ్యవస్థలు, డ్రోన్లు, సెన్సార్లు మరియు బయోచార్ ఉత్పత్తి కోసం ఇన్నోవేషన్ సెంటర్ స్థాపించడానికి కర్నూల్ కృష్ణగిరి మండలంలో 80 ఎకరాలు రాయితీ రేటు ఎకరాకు ఒక లక్షకు కేటాయించబడ్డాయి, ఇది రూ. 300 కోట్ల పెట్టుబడి మరియు 300 మందికి ఉపాధి కల్పిస్తుంది.

14. M/S లూలూ ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ ప్రైవేట్ లిమిటెడ్ - విశాఖపట్నం మెగా మాల్

విశాఖపట్నం బీచ్ రోడ్‌లో 13.74 ఎకరాల్లో మెగా షాపింగ్ మాల్ ప్రాజెక్ట్ కోసం M/S లూలూ ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సవరించిన లీజు అద్దె నిబంధనలను ఆమోదించింది. వార్షిక లీజు అద్దె 7.08 కోట్లకు నిర్ణయించబడింది, ప్రతి పది సంవత్సరాలకు పది శాతం పెంపుదలతో, మూడు సంవత్సరాల అద్దె-రహిత నిర్మాణ కాలంతో. ఈ ప్రాజెక్ట్‌లో 1,066 కోట్ల పెట్టుబడి ఉంటుంది మరియు 500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు కల్పించబడతాయి.

15. రేమండ్ గ్రూప్ - M/S JK మైని కంపెనీలు

రేమండ్ గ్రూప్ యొక్క రెండు అనుబంధ సంస్థల కోసం సమగ్ర ప్రతిపాదనలను ఆమోదించింది. M/s JK మైని ప్రెసిషన్ టెక్నాలజీ లిమిటెడ్‌కు ఆటోమోటివ్ కాంపోనెంట్ తయారీ కోసం అనంతపురం గుడిపల్లి ఇండస్ట్రియల్ పార్క్‌లో 30 ఎకరాలను ఎకరాకు 45.95 లక్షలకు కేటాయించడం జరిగింది, రూ. 430 కోట్ల పెట్టుబడి మరియు 4,096 ఉద్యోగావకాశాలు కల్పించనుంది. M/s JK మైని గ్లోబల్ ఏరోస్పేస్ లిమిటెడ్‌కు ఏరోస్పేస్ కాంపోనెంట్ తయారీ కోసం గుడిపల్లి మరియు తేకులోడు అంతటా 47.28 ఎకరాలు కేటాయించబడ్డాయి, రూ. 510 కోట్ల పెట్టుబడి మరియు 1,400 ఉద్యోగావకాశాలు కల్పించనుంది.

16. పారిశ్రామిక విస్తరణ ప్రతిపాదనలు

మంత్రివర్గం రెండు ప్రధాన పారిశ్రామిక విస్తరణ ప్రతిపాదనలను ఆమోదించింది. M/s సన్వీరా ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు అనకాపల్లి రాంబిల్లిలో 122.01 ఎకరాల్లో అధునాతన కార్బన్ కాంప్లెక్స్ స్థాపించడానికి ఆమోదం లభించింది, రూ. 260 కోట్ల పెట్టుబడితో 800 ఉద్యోగాలు సృష్టించబడతాయి. ఎకరాకు రూ. 80 లక్షల రాయితీ ధరతో భూమి కేటాయించబడుతుంది, కార్బన్ క్యాథోడ్స్, గ్రాఫైట్ ఎలక్ట్రోడ్స్ మరియు స్పెషాలిటీ ఉత్పత్తులు తయారు చేయబడతాయి. పల్నాడు జిల్లాలో M/s శ్రీ సిమెంట్ లిమిటెడ్ ఇంటిగ్రేటెడ్ సిమెంట్ ప్లాంట్ విస్తరణ కోసం రెండు వేల రెండు వందల అరవై కోట్ల పెట్టుబడికి 350 మంది అదనపు ఉద్యోగాలతో ఆమోదం పొందింది.

17. పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధికి హడ్కో రుణ హామీ

మంత్రివర్గం సెప్టెంబర్ 29, 2025న ఆర్థిక శాఖ అమలు చేసిన ఐదు వేల కోట్ల రుణానికి సంబంధించిన హామీ డీడ్ మరియు లెటర్ ఆఫ్ కంఫర్ట్‌ను ఆమోదించింది. APIIC లిమిటెడ్ యొక్క పూర్తి అనుబంధ సంస్థ అయిన ఆంధ్రప్రదేశ స్టేట్ స్పెషల్ ప్రాజెక్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తరపున హడ్కో నుండి 8.60 శాతం వడ్డీతో ఈ రుణానికి ఆమోదం తెలిపింది. ఈ నిధులు కర్నూల్‌లోని ఓర్వకల్, వైఎస్సార్ కడప జిల్లాలోని కొప్పర్తి మరియు ప్రకాశం జిల్లాలోని పామూర వద్ద మూడు వ్యూహాత్మక పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేయడానికి ఉపయోగించబడతాయి.

యువజన అభివృద్ధి, పర్యాటక & సాంస్కృతిక శాఖ

రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. వాటికి కావలసిన ప్రోత్సాహకాలను అందజేయటం, భూములను తక్కువ ధరలకే కేటాయించడం ద్వారా ఈ రంగ అభివృద్ధికి దోహదపడుతున్నది. నేడు జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో ఏడు పర్యాటక ప్రాజెక్టులకు రాష్ట్రమంత్రి మండల ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో దాదాపు రూ.1,628.8 కోట్ల పెట్టుబడులకు అవకాశం కలిగింది. తద్వారా 4,398 మందికి ప్రత్యక్షంగా ను మరికొన్ని వేల మందికి పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి.

18. M/s సదర్న్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్:

అమరావతిలో M/s సదర్న్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్‌కు 4-స్టార్ హోటల్ (కోర్ట్‌యార్డ్ బై మారియట్) అభివృద్ధికై ప్రోత్సాహకాలు అందించేందుకు SIPB సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రూ.176.96 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగ అవకాశాలు.

19. M/s శ్రీ వెంకటేశ్వర లాడ్జ్ ప్రైవేట్:

శ్రీశైలంలో M/s శ్రీ వెంకటేశ్వర లాడ్జ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 3-స్టార్ హోటల్ (హిల్టన్ గార్డెన్ ఇన్ బ్రాండ్) అభివృద్ధికై ప్రోత్సాహకాలు అందించేందుకు SIPB సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రూ.83 కోట్ల పెట్టబడి, 300 మందికి ఉద్యోగ అవకాశాలు.

20. M/s దసపల్లా అమరావతి హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్:

అమరావతిలో M/s దస్పల్ల అమరావతి హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 4-స్టార్ హోటల్ (దస్పల్ల బ్రాండ్) అభివృద్ధికై ప్రోత్సాహకాలు అందించేందుకు SIPB సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రూ.200 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉద్యోగ అవకాశాలు.

21. M/s మైరా బేవ్యూ రిసార్ట్స్‌కు మైరా బేవ్యూ రిసార్ట్స్ & కన్వెన్షన్ సెంటర్ :

విశాఖపట్నంలో కొత్తవలస వద్ద M/s మైరా బేవ్యూ రిసార్ట్స్‌కు మైరా బేవ్యూ రిసార్ట్స్ & కన్వెన్షన్ సెంటర్ అభివృద్ధికై భూమి మరియు ప్రోత్సాహకాలు అందించేందుకు SIPB సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రూ.255.91 కోట్ల పెట్టుబడి, 500 మందికి ఉద్యోగ అవకాశాలు.

22. M/s VSK హోటల్స్ & రిసార్ట్స్:

అరకు వ్యాలీలో M/s VSK హోటల్స్ & రిసార్ట్స్ LLP కు ఈకో - లగ్జరీ రిసార్ట్ అభివృద్ధికై ప్రోత్సాహకాలు అందించేందుకు SIPB సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రూ. 55.84 కోట్ల పెట్టుబడి, 98 మందికి ఉద్యోగ అవకాశాలు.

23. M/s ట్రైడెంట్ తిరుపతి లిమిటెడ్ & ఓబెరాయ్ (విలాస్) రిసార్ట్ :

తిరుపతిలో ఉన్న Sy.No.588/A లో ఉన్న Acs.20.00లో M/s ట్రైడెంట్ తిరుపతి లిమిటెడ్‌కు ఓబెరాయ్ (విలాస్) రిసార్ట్ అభివృద్ధికై భూమి కేటాయింపుకు SIPB సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. కొన్ని మినహాయింపులు మరియు చెల్లింపుల సవరణ కూడా చేయడం జరిగింది. రూ.250 కోట్ల పెట్టుబడి, 1500 మందికి ఉద్యోగ అవకాశాలు.

# గిరిజన కార్మికుల ఆకలి బాధలు ముగ్గురు మంత్రులకు కనిపించడం లేదా!

**- గిరిజన హాస్టల్ కార్మికుల నోటికాడి బువ్వ గుంజుకుంటున్న కాంగ్రెస్ సర్కార్ - గిరిజన హాస్టల్స్ మూసివేసే పరిస్థితి వచ్చిన స్పందించని ప్రభుత్వం - డైలీ వేజ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి మధు - ఐ టి డి ఏ ముందు గిరిజన కార్మికుల 72 గంటల మహాధర్నా - భారీగా తరలి వచ్చిన డైలీ ఇమేజ్ అవుట్సోర్సింగ్ కార్మికులు - గిరిజన కార్మికులకు ప్రజాసంఘాల నుండి పెరుగుతున్న మద్దతు**

**భద్రాచలం, (రాజధాని వార్తలు):** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వున్న ముగ్గురు మంత్రులకు గిరిజన విద్యార్థులకు వండి పెట్టే హాస్టల్ కార్మికుల ఆకలి బాధలు కనిపించడం లేదని, గిరిజన కార్మికుల నోటికాడి బువ్వను కాంగ్రెస్ ప్రభుత్వం గుంజుకుంటుందని ఓట్లేసి గెలిపించిన పాపానికి జీతాలు తగ్గిస్తారా అని డైలీ వేజ్ మరియు ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి మధు ప్రశ్నించారు. డైలివేజ్ వర్కర్లకు టైమ్ స్కేల్ ఇవ్వాలని అప్పటివరకు కలెక్టర్ గెజిట్ ప్రకారం జీతాలు చెల్లించాలని, ఔట్ సోర్సింగ్ వర్కర్లకు జీవో 60 ప్రకారం 15600/-ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలతో పాటు ఆరోగ్య భీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తూ గత 32 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వ గిరిజన హాస్టల్ డైలీ వేజ్ కార్మికులు సోమవారం భద్రాచలం ఐటిడిఏ ముందు 72 గంటల మహాధర్నాను ప్రారంభించారు. ఉదయం నుండి కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వందల సంఖ్యలో కార్మికులు తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాన్ని విరమించేది లేదని ఐ టి డి ఏ ఎదుచబైటాయించారు. స్థానిక గిరిజన ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రితో మాట్లాడి గిరిజన కార్మికులకు పాత జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. 72 గంటల ధర్నా సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ గిరిజన కార్మికుల సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని చదువుకోవాల్సిన విద్యార్థులు పోయి దగ్గర మగ్గిపోతుంటే విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు క్లీనింగ్ పనులు చేస్తున్నారని ఈ దుస్థితికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమని అన్నారు.





కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఒక్కొక్క కార్మికుడు నెలకు 16 వేల రూపాయల నష్టపోయాడని అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం 15,600 చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న ఐటిడిఏ పరిధిలో ఒక్కో ఐటిడిఏ కి ఒక్కో విధానాన్ని కొనసాగిస్తూ కార్మికుల పొట్టను కొట్టడం సరైనది కాదని మధు ఆరోపించారు. ప్రజా ప్రతినిధులు గాని ప్రభుత్వ ఉద్యోగులకు గాని జీతాలు తగ్గిస్తే పనిచేస్తారా అని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. లక్షల్లో జీతాలు తీసుకుంటున్న ప్రజా ప్రతినిధులకు కార్మికుల ఆకలి బాధలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

**జీతాలు తగ్గిస్తే గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగులు పని చేస్తారా? : కారం పుల్లయ్య ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి**

గిరిజన కార్మికులు చేస్తున్న 72 గంటల మహా ధర్నాకు తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య సందర్శించి తమ పూర్తి మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు ఒక నెల జీతం తగ్గిస్తే విధులకు హాజరవుతారా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి గిరిజనులు ఓట్లు వేసి గెలిపించింది జీతాలు తగ్గించడానికి అని ఆయన విమర్శించారు. ప్రభుత్వ విధానాల వల్ల గిరిజన విద్యార్థిని విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని హాస్టల్లో మూసివేసే పరిస్థితికి కారణం ప్రభుత్వమేనని ప్రభుత్వ విధానాలతోనే ఈరోజు గిరిజన హాస్టల్లో మూతపడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి కార్మికులతో చర్చలు జరిపి వారి సమస్యను పరిష్కరించకపోతే గిరిజన కార్మికుల అండగా గిరి సంగంవారి సమస్యను పరిష్కరించకపోతే గిరిజన కార్మికుల అండగా ఆదివాసి తెలంగాణ గిరిజన సంఘం ఉద్యమిస్తుందని హెచ్చరించారు.

**ప్రభుత్వం స్పందించకపోతే పోరాటాన్ని ఉధృతం : కొలగాని బ్రహ్మాచారి సిఐటియు జిల్లా అధ్యక్షులు**

ఇన్ని రోజులుగా గిరిజన కార్మికులు సమ్మె చేస్తున్న ప్రభుత్వం గానీ ప్రభుత్వ పెద్దలు గానీ స్పందించకపోవడం దుర్మార్గమని స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ముఖ్యమంత్రితో చర్చించి గిరిజన కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కొలగని బ్రహ్మాచారి స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలకు మంత్రులకు ఎన్నిసార్లు దండాలు పెట్టి దరఖాస్తులు ఇచ్చిన కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదని గతిలేని పరిస్థితిలోనే 72 గంటల మహా ధర్నాకు కార్మికులు దిగారని ఇకనైనా ప్రభుత్వ పెద్దలు స్పందించకపోతే జరిగే పరిణామాలకు వారే బాధ్యత వహించాలని బ్రహ్మాచారి హెచ్చరించారు. హాస్టల్ డైలీ బీజ్ వర్కర్ల పోరాటానికి వివిధ ప్రజాసంఘాల నుండి మద్దతు రోజురోజుకు పెరుగుతుందని అన్నారు.

72 గంటల్లో ప్రభుత్వం స్పందించి హాస్టల్ డైలీ వేజ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో కలిసొచ్చే సంఘాలను కలుపుకొని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బ్రహ్మాచారి హెచ్చరించారు. ఈ 72 గంటల మహా ధర్నాలో డైలీ వేజ్ కార్మికుల జిల్లా కార్యదర్శి హీరాలాల్ నాగేశ్వరరావు మంగమ్మ మంగీలాల్ స్వామి జలంధర్ తిరుపతమ్మ ఈశ్వర్ రామ కల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గడ్డం స్వామి ఎస్ఎఫ్ఐ భద్రాచలం డివిజన్ నాయకులు రవి గిరిజన సంఘం పట్టణ కార్యదర్శి కొంజా శ్రీను సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు భూపేందర్ నాయకులు సున్నం ప్రవీణ్ డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సతీష్ బాబు తో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు డైలీ వేస్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా జోరు వానలో సైతం ఐటిడి ఆవరణలోనే వంటావార్పును నిర్వహించి అక్కడే భోజనాలు చేసి 72 గంటల ధర్నాను కార్మికులు కొనసాగిస్తున్నారు

# చర్ల నుండి భద్రాచలం వచ్చే రహదారులు ఆగమై అయిపోతున్న పట్టించుకునే నాధుడు

**రోడ్లు గుంతలు పడి వాహన దారులుఅనేక ఇబ్బందులు పడుతున్న పట్టించుకోని అధికారులు : సొసైటీ పేరుతో గిరిజనులను మోసం చేస్తున్న దళారులు**






**చర్ల, (రాజధాని వార్తలు):** చర్ల మండలంలో జరిగే ఇసుక వ్యాపార లావాదేవీలు ఆదివాసుల చేతులలో లేవు ఎన్ని లారీలు వెళుతున్నాయి వస్తున్నాయి పాసింగ్ లారీలు ఎన్ని ఇసుక డంపింగ్ ఎంత మెయింటెనెన్స్ ఖర్చులు ఎంత అన్న విషయం నిజంగా ఆదివాసి సొసైటీల అధ్యక్షులు సభ్యులకు తెలుసా ప్రైవేటు రైసింగ్ కాంట్రాక్టర్ల చేతిలో ఇసుక దోపిడీ జరుగుతుందని రోడ్లు పాడైపోతున్నాయని ఇసుక మోసపూరిత వ్యాపారం చేసే వారి పేర్లతో సైతం బయటపెట్టినా – పత్రికాముఖంగా ప్రచురించిన ప్రముఖ రాజకీయ పార్టీలు ఆరోపిస్తున్న అధికారులు తీసుకునే చర్యలు ఏవి పేర్లతో సహా ఇసుక రైజింగ్ కాంట్రాక్టర్ల పేరును బయట పెట్టిన (సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ) కెచ్చేలరంగారెడ్డి, సి బి సి ఐ డితో విచారణ జరిపించాలన్న డిమాండ్. భద్రాచలం నియోజకవర్గం ఏజెన్సీ ప్రాంతంలో ఇసుక లారీల రద్దీతో ఆదివాసి పల్లెలు ప్రజల ప్రయాణం అగమ్య గోచరం ట్రాఫిక్ జామ్ సమస్యతో ఇసుక లారీల వలన జరిగే ప్రమాదాలకు బాధ్యులు ఎవరు జవాబు దారితనం ఉందా? లేదా సామాన్యులు ప్రయాణించే రోడ్లలో ద్విచక్ర వాహనదారులకు భద్రత లేదు ప్రభుత్వం నడిపించే



ఆర్టీసీ బస్సులు సైతం ఇసుక వాహనాల ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి వృద్ధులు పిల్లలు మహిళలు అనారోగ్యం బారిన పడిన వారు ప్రయాణం చేయాలంటే నాన్న అవస్థలు పడుతున్నారు. అంబులెన్స్‌కు కూడా దారి ఉండదు ప్రాణాలు పోతే పరిస్థితి ఏంటి పాదచారులు గొర్రెల కాపరులు పశువుల కాపరులకు రోడ్లమీద తిరిగే పశువులకు కూడా భద్రత లేదు భద్రాచలం టు వాజేడు దాకా రోడ్డు అంతా గుంతలమయం. ఇప్పుడు ఎటపాక టు ఎక్స్ రోడ్ మారాయిగూడెం వయా ములకపాడు రోడ్డు నాశనం అవ్వడానికి సిద్ధంగా ఉంది.

# భద్రాచలంలో పలు అభివృద్ధి పనులలో భాగంగా సిసి రోడ్లకు శంకుస్థాపన చేసిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం మండలంలో ఇండస్ట్రియల్ ఏరియా, అశోక్ నగర్ కొత్త కాలనీ, రాజపేట కాలనీ, శాంతినగర్ కాలనీ, ఎమ్మార్వో ఆఫీస్, పోలీస్ స్టేషన్ నందు పలు అభివృద్ధి పనుల్లో భాగంగా సిసి రోడ్లకు శంకుస్థాపనలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సిసి రోడ్లకు శంకుస్థాపనలు చేయడం జరిగింది. త్వరలోనే రామాలయం టెంపుల్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుంది. లక్షల రూపాయలు నిధులను తీసుకు వచ్చి భద్రాచలం అభివృద్ధి చేస్తున్నందుకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శంకుస్థాపన చేసిన ప్రతి ఒక్క కాలనీలోని ప్రజలు



అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, ఇంచార్జ్ ఎండి నవాబు తదితరులు పాల్గొన్నారు.

# ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయాలను సందర్శించిన ఐటిడిఎ పి ఓ రాహుల్





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో పనిచేసే సిబ్బంది యొక్క పూర్తిస్థాయి రికార్డులు సక్రమంగా నిర్వహించి చాలా జాగ్రత్తగా భద్రపరిచే విధంగా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. సోమవారం నాడు ఐటీడీఏ కార్యాలయంలోని ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయమును ఆయన సందర్శించారు. డిడి ట్రైబల్ వెల్ఫేర్ సెక్షన్‌లో పూర్తిస్థాయి రికార్డులను, సేవా పుస్తకములను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి సేవా పుస్తకముల నిర్వహణ తీరును డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్ మరియు సిబ్బందిని అడిగి తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎం మరియు వార్డెన్ ఉపాధ్యాయులు సిబ్బందికి సంబంధించిన సర్వీస్ బుక్కులు పూర్తి స్థాయిలో పరిశీలించడం జరిగిందని, సర్వీస్ బుక్కుల నిర్వహణలో సిబ్బంది ఎవరైనా క్రమశిక్షణ రాహిత్యంగా ప్రవర్తించినట్లు నా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిబ్బందికి హెచ్చరించారు. సర్వీస్ బుక్కులు నిర్వహణ విషయంలో ఆ సెక్షన్లకు సంబంధించిన సిబ్బంది చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, పర్యవేక్షకురాలు ప్రమీల బాయ్, సిబ్బంది రమణమూర్తి, రామకృష్ణారెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# సత్య కళాశాల ఎన్ సి సి బాలుర విభాగం ఎంపిక





**విజయనగరం, (రాజధాని వార్తలు):** స్థానిక తోటపాలెం పరిధిలో గల సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల బాలుర ఎన్‌సిసి విభాగం ఎంపిక ప్రక్రియను అయోధ్య మైదానంలో 13 బాయ్స్ బెటాలియన్, విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ నీరజ్ కుమార్, సుబేదార్ దేవేందర్ సింగ్, హవల్దార్ ఆనంద్ సింగ్, హవల్దార్ రామ్ ప్రసాద్, హవల్దార్ కులదీప్ కాల, జిసిఎల్ దివ్య దుర్గా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపిక ప్రక్రియలో అభ్యర్థులను 1600 మీటర్ల పరుగు, సిటప్‌లు, పుష్ అప్‌లు, 100 మీటర్ల స్ప్రింట్, ఎత్తు, బరువు, కంటి చూపు వంటివి పరీక్షించి వ్యక్తిగత ఇంటర్వ్యూ ను నిర్వహించారు. మొత్తం 100 మంది సత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా. మజ్జి శశిభూషణ రావు, ఎన్‌సిసి అధికారులు, లెఫ్టినెంట్ ఎం. ఉదయ్ కిరణ్, యన్ సి సి క్యాడట్స్ పాల్గొన్నారు. ఈ ఎంపిక శిబిరం ద్వారా విద్యార్థుల శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి పట్ల ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని నిర్వాహకులు తెలిపారు.

# చెక్ బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలు

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** చెక్ బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలు, 7.50 లక్షలు జరిమానా విధిస్తూ స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏ.విజయ రాజ్‌కుమార్ సోమవారం తీర్పు చెప్పారు. కోర్టు కార్యాలయ సిబ్బంది అందించిన వివరాలు ప్రకారం, గజపతినగరానికి చెందిన ఇప్పిన గిరి శ్రీను అనే వ్యక్తికి పురిటిపెంట గ్రామానికి చెందిన కంది వెంకటరమణ అప్పు నిమిత్తం ఐదు లక్షల రూపాయలు చెక్కు ఇచ్చారు. ఆ చెక్కు బౌన్స్ కావడంతో ఇప్పిన గిరి శ్రీను కోర్టులో ఫిర్యాదు చేశారు. అనేక వాదనలు అనంతరం మెజిస్ట్రేట్ ఏ.విజయ రాజ్ కుమార్ ముద్దాయి కంది వెంకటరమణకు ఏడాది జైలు విధిస్తూ, ఏడు లక్షల 45 వేల రూపాయలు ఫిర్యాదుదారునికి చెల్లించాలని, అలాగే గవర్నమెంట్ ఫీజు కింద 5000 రూపాయలు చెల్లించాలని తుది తీర్పు చెప్పారు.



# RAJADHANI CLASSIFIEDS Ad. Call

## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎఫ్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడిని ఖండిస్తూ రాస్తారోకో





**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడిని ఖండిస్తూ మాల మహానాడు నియోజకవర్గ కన్వీనర్ బోని సన్నబాబు ఆధ్వర్యంలో తాళ్లవలస అంబేద్కర్ కూడలి వద్ద రాస్తారకో నిర్వహించారు ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు బోని సన్నిబాబు సియ్యాద్రి రాం బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి భాగం గోపాలరావు మాట్లాడుతూ భారత దేశంలో అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తిపై దాడిని దేశ సార్వభౌమాధికారం పై దాడిగా అభివర్ణిం చారు ప్రధాన న్యాయమూర్తి దళితుడైనందున సనాతన ధర్మం పేరుతో కిషోర్ అనే న్యాయవాది బూటు తో దాడి చేశారని అదే స్థానంలో ఓసి న్యాయమూర్తి ఉంటే దాడి చేయగలరా అని ప్రశ్నిం చారు? దాడి చేసిన న్యాయవాదిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ప్రయోగించి అరెస్టు చేయాలని అలాగే అతని సభ్యత్వాన్ని శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరియు తెలుగు రాష్ట్రానికి సంబంధించిన హర్యానా క్యాడర్ అడిషనల్ డీజీపీ పురాన్ కుమార్ పై అవినీతి ఆరోపణలతో కుట్ర చేసి ఇరికించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన పోలీస్ ఉన్నతాధికారులపై చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు అలాగే ఒక అడిషనల్ డిజిపి స్థాయి అధికారి మరణిస్తే అతనికంటే చిన్న కేడర్ అయిన ఐజి స్థాయి అధికారితో సిట్ వేయడం ఎంతవరకు న్యాయమని ఎద్దేవా చేశారు పై రెండు సంఘటనలపై కేంద్ర రాష్ట ప్రభుత్వాలు స్పందించాలని సనాతన ధర్మం పేరుతో దళితులపై జరుగుతున్న దాడులను ఆపాలని దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని ఎస్సీ ఎస్టీ చట్టాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో దళిత నాయకులు బోని ప్రసాద్ బెల్లన అప్పారావు బోని నర్సింగరావు యాగాటి రామారావు మామిడి భాస్కరరావు బోని శివ మట్ట ఆదినారాయణ లంక పైడ్రాజు బోనీ హరిబాబు తది తరులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం అరికట్టాలని ధర్నా

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం నియోజకవర్గ ఇంచార్జ్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో వైస్సార్సీపీ పార్టీ ఎక్సైజ్ కార్యా లయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా దొర బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్పటి నుండి నారా వారి కల్తీ మద్యం తయారీ ఒక కుటీర పరిశ్రమలా ఏర్పడి రాష్ట్ర వ్యాప్తంగా అమ్మ కాలు కొనసాగిస్తూ ప్రభుత్వ ఖాజానకు నష్టంతో పాటుగా ప్రజల ఆరోగ్యంతో చెల గాటం ఆడివారి ప్రాణాలు కోల్పోవడానికి కారణం అయ్యిం దన్నారు. తప్పుడు ప్రచారంతో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో లిక్కర్ స్కామ్ జరిగిందని ప్రజల్లో వారు అలజడి సృష్టించారన్నారు. రాష్ట్రంలో కల్తీ మద్యం అరికట్టాలని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అధికారులకు వినతి పత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కంటి సాయి ప్రసాద్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు ఆవాల లక్ష్మి నారాయణ, నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు సేపేని రూప, సామర్లకోట పట్టణ మహిళా అధ్యక్షురాలు పాలిక కుసుమ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోసెస్, నియోజక వర్గ పరిధి లోని వైసీపి సర్పంచిలు, ఎంపిటిసిలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈజీగా డబ్బులు వస్తాయంటే నమ్మి మోసపోవద్దు




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ఉచితంగా డబ్బులు సంపాదించే ఐడియా ఉందని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఇస్తామని చెప్పే ఫోన్ కాల్స్‌ను ప్రజలు నమ్మి మోసపోవద్దని, సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం డి ఎస్పీ డి శ్రీహరి రాజు సూచించారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలుపుతూ ఈ మధ్య కాలంలో సైబర్ నేరగాళ్ళ మోసాలు బాగా పెరిగి పోయాయాన్నారు. ఏవో అజ్ఞాత లాభాల మాటలకు లోనై నష్టపోవద్దని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండి మోసాల నుండి రక్షించుకోవా లన్నారు. ఫోన్ పే ద్వారా నగదు బదిలీ చేశాక, వారి పేరుతో ఒక యూసర్ ఐడితో ట్రేడింగ్ అకౌంట్ తయారు చేసి, ఆ తరువాత కూడా సైబర్ మోసగా ళ్లు నిరంతరం ఫోన్ ద్వారా సంప్రదిస్తూ, పెద్ద మొత్తాల లావాదేవీలు చేయమని ప్రలోభపెడతాడ తారన్నారు. తెలియని వ్యక్తులు లేదా సంస్థల పేరుతో ఫోన్ కాల్స్, సోషల్ మీడియా, లేదా ట్రేడింగ్ యాప్ల ద్వారా ఎక్కువ లాభాలు వస్తాయని చెప్పి డబ్బులు మోసం చేసే ఘటనలు తరచుగా చోటు చేసుకుంటున్నాయన్నారు. "తక్కువ పెట్టుబ డికి ఎక్కువ లాభం" అంటూ ఆకర్షించే మాటలు చెప్పే వారిని నమ్మి మోసపోవద్దన్నారు. బ్యాంక్ వివరాలు, ఓటీపీ యూపీఐ పిన్, వంటి వివరాలు ఎవరికీ ఇవ్వకూడదన్నారు. అలాంటి మోసపూరిత ఫోన్ కాల్స్ వస్తే వెంటనే పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తే ప్రజల ఖాతాలోని సొమ్ము సైబర్ నేరగాళ్ల ఖాతాలోకి వెళ్లకుండా రక్షణ కల్పించడం జరుగు తుందన్నారు. ఈ విషయాలను ప్రజలు గమనించి సైబర్ నేరగాల నుంచి బయటపడాలని డీఎస్పీ శ్రీహరి రాజు తెలిపారు.

# పంచారామంలో సుప్రీం మాజీ ప్రధాన న్యాయమూర్తి కుటుంబం పూజలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచారామ క్షేత్రం అయిన సామర్లకోట శ్రీకుమారా రామ భీమేశ్వర ఆలయంలో సోమవారం రాత్రి జస్టిస్ సుప్రీం కోర్ట్ మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్ వి రమణ కుటుంబం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయానికి విచ్చేసిన జస్టిస్ కుటుంబానికి ఆలయ చైర్మెన్ కంటే జగదీష్ మోహన్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ దంపతులు తొలుత ధ్వజస్తంభం వద్దవున్న శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భీమేశ్వర స్వామికి, బాలా త్రిపుర సుందరి అమ్మవారి దర్శించుకున్నారు. అనంతరం జస్టిస్ కుటుం బానికి నంది మండపంలో వేద పండితులు, ఆలయ అర్చకులు సన్నిదిరాజు వెంకట రమణ, చెరుకూరి సుందర రామయ్య, సత్యనారాయణలు పండిత ఆశీర్వచనం అందించారు. ఈ సం దర్బంగా ఆలయ చైర్మెన్ జస్టిస్ దంపతులను సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదములు, స్వామివారి చిత్రపటం అందజేశారు. ఈ సందర్బంగా జస్టిస్ కుటుంబం వెంట తూర్పుగోదావరి జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ సునీత గంధం, కాకినాడ జిల్లా నాల్గవ జూనియర్ జడ్జ్ నిరుప భాంజ్, ఇతర కోర్ట్ సిబ్బంది, సామర్లకోట పోలీస్, రెవెన్యూ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI No: APTEL/2015/66622, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan